www.prajamantalu.com
Praja mantalu, Jagtial

# ప్రజా మంటలు

సంపుటి :5 పేజీలు - 8
సంచిక :02 వెల - రూ. 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

శనివారం 02 మార్చి 2024

## మూడు కార్పొరేషన్లకు చైర్మన్లు

హైదరాబాద్, మార్చి1 (ప్రజా మంటలు): రాష్ట్ర ప్రభుత్వం మూడు కార్పొరేషన్లకు చైర్మన్లను ప్రకటించినట్టు సమాచారం. మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఓబెదుల్లా కోత్వాల్, ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా తాహెర్ బిన్ హందాన్, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా దీపక్ జాన్‌ను నియమించినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

# మేడిగడ్డలో చిన్న సమస్య ఏర్పడింది

## భూతద్దంలో చూపి రాజకీయం చేస్తున్నారు

### రాజకీయంగా మాపై కక్ష తీర్చుకోండి రైతులను మాత్రం కాపాడండి: కెటిఆర్



మహదేవ్‌పూర్,మార్చి1 (ప్రజా మంటలు): మేడిగడ్డ అంశంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మేడిగడ్డ బ్యారేజ్‌ను శుక్రవారం భారాస నేతల బృందం పరిశీలించింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డలో చిన్న సమస్యను భూతద్దంలో పెట్టి పెద్దదిగా చూపిస్తున్నారు. మొత్తం ప్రాజెక్టు, రూ.లక్ష కోట్లు వృథా చేశారంటూ అధికార పార్టీ దుష్ప్రచారం చేయడం సరికాదు. పగ, కోపం ఉంటే రాజకీయంగా మాపై తీర్చుకోండి. రైతులు, రాష్ట్రంపై వద్దని కెటిఆర్ అన్నారు. 1.6కి.మీ బ్యారేజ్‌లో 50 మీటర్ల ప్రాంతంలో సమస్య ఉంది. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదన్నట్లుగా అధికార పార్టీ నేతలు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన కడెం, గుండ్లవాగు రెండుసార్లు కొట్టుకుపోయాయి. నాగార్జున సాగర్, శ్రీశైలంలోనూ లీకేజ్‌లు వచ్చాయి. వాటిపై మేం రాజకీయాలు చేయలేదు. నిపుణుల సలహాలు తీసుకొని వరదలు వచ్చేలోగా మేడిగడ్డను పునరుద్ధరించాలని కోరుతున్నాం మని కెటిఆర్ తెలిపారు. రైతులు, రాష్ట్రంపై పగ పట్టవద్దు.. పగ, కోపం ఉంటే రాజకీయంగా తమపై తీర్చుకుంటే ఇబ్బంది లేదు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మేడిగడ్డ బరాజ్‌ను పరిశీలన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.మేడిగడ్డకు సంబంధించి 1.6 కిలోమీటర్ల బరాజ్‌లో 50 మీటర్ల ప్రాంతంలో

మిగతా 2లో..

## రైతు, ఎడ్యుకేషన్ కమిషన్లను ఏర్పాటు విద్యావిధానంపై కమిషన్ నిర్ణయం

### అఖిలపక్షంలో చర్చించి కౌలురైతులకు చేయూత

### పౌరసమాజం నేతలతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి1 (ప్రజా మంటలు): రైతు, ఎడ్యుకేషన్ కమిషన్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని... త్వరలోనే వీటిని ప్రకటించబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆర్థిక, విద్యుత్, సాగునీటి రంగాలపై పూర్తి వివరాలతో అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేశామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నాడు పౌర సమాజం ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా



## బెంగళూరులో భారీ పేలుడు ఉలిక్కిపడిన నగరం

- రామేశ్వరం కేఫ్‌లో పేలిన బాంబు
- ముగ్గురు కేఫ్ సిబ్బందికి గాయాలు
- బ్యాగులో ఉంచి పదార్థాలతో పేలుడు
- రంగంలోకి దిగిన ఎన్ఐఎ



బెంగళూరు, మార్చి1 (ప్రజా మంటలు): బెంగళూరులో భారీ పేలుడు సంభవించింది. ఒక్కసారి జరిగిన ఘటనతో నగరం ఉలిక్కిపడింది. రాజాజీనగర్ ప్రాంతంలోని రామేశ్వరం కేఫ్‌లో మధ్యాహ్న భోజనం సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ పేలుడులో ముగ్గురు కేఫ్ సిబ్బందితో పాటు ఒక కస్టమర్ కు గాయాలయినట్లు సమచారం. వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియలేదు. సిలిండర్ పేలడం వల్లే

మిగతా 2లో..

## మేడిగడ్డపై ఇంతకాలం నిజాలు దాచారు

### మంత్రి ఉత్తమ్ కుమార్ ఆగ్రహం



హైదరాబాద్, మార్చి1 (ప్రజా మంటలు): మేడిగడ్డ విషయంలో భారాస తీరు హాస్యాస్పదమని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. 'మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై సత్వర విచారణ జరగాలి. ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వం భారీ తప్పులు చేసింది. కమిషన్ల కోసం రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టింది. కొన్ని రిపోర్టులను ప్రభుత్వం ఇవ్వలేదని ఎన్డీఎస్‌ఏ పేర్కొంది. విజిలెన్స్ నివేదికపై న్యాయసలహా తీసుకుని కేసులు నమోదు చేస్తాం' అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. చలో మేడిగడ్డ బయలుదేరిన

మిగతా 2లో..

## ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ కాళేశ్వరం

- కుంగిన పిల్లర్లను సరిచేయడమే సాంకేతికత
- నీటిని ఉపయోగించుకకుండా విమర్శలు సరికాదు
- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వెల్లడి
- మేడిగడ్డకు బయలుదేరిన బిఆర్ఎస్ బృందం



హైదరాబాద్, మార్చి1 (ప్రజా మంటలు): ప్రపంచంలోనే అతి గొప్ప లిఫ్ట ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం అని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. 5 వందలు 6 వందలు మీటర్ల లోతునుంచి నీళ్లను లిఫ్ట్ చేసే గొప్ప పథకం అని.. ప్రాజెక్టులు పూర్తి చేసి వలసలు ఆపినట్లు తెలిపారు. 86 పిల్లర్లలో 3 పిల్లర్లు కుంగాయని.. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులో కూడా సంకేతిక లోపాలు ఉంటాయి సరిదిద్దుకోవాలంటూ కోరారు.

మిగతా 2లో..

## దొంగే..దొంగా అన్నట్లుగా ఉంది

### కాళేశ్వరంపై బిఆర్ఎస్ వాదనలు తప్పు

### పిల్లర్లు కుంగితే ఏమీ జరగలేదని అంటారా

### మండిపడ్డ టిజెఎస్ అద్యక్షుడు కోదండరామ్



హైదరాబాద్, మార్చి1 (ప్రజా మంటలు): దొంగే దొంగ అన్నట్లు బీఆర్ఎస్ వైఖరి ఉందని టీజేఎస్ చీఫ్ కోదండరాం వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ మూడు పిల్లర్లు కుంగి పోనా...న మేడిగడ్డ పటిష్టంగా ఉందని చెప్పడం శుద్ధ తప్పన్నారు. ప్రణాళిక, నాణ్యత, నిర్వహణ, డిజైన్ లోపం వల్లే పిల్లర్లు కుంగిపోయాయన్నారు.

మిగతా 2లో..



## సిఎం రేవంత్‌తో రితేశ్ చౌహాన్ భేటీ

హైదరాబాద్, మార్చి1 (ప్రజా మంటలు): సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన కేంద్ర వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీ రితేష్ చౌహాన్ కలిశారు. వ్యవసాయ శాఖ పథకాలపై సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, సంబంధిత శాఖ అధికారులు హాజరయ్యారు.

## చెప్పిందే చేస్తాం.. చేయగలిగేదే చెప్తాం

### ఇచ్చిన హామీలను అమలు చేసిచూపుతాం

### డిప్యూటి సిఎం మల్లు భట్టివిక్రమార్క



ఖమ్మం,మార్చి1 (ప్రజా మంటలు): కాంగ్రెస్ ప్రభుత్వంలో చెప్పిందే చేస్తాం.. చేయగలిగేదే చెప్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ముదిగొండ మండల సీతారాంపురం సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... తనను ఈ స్థాయిలో ఉంచింది మధిర నియోజకవర్గ ప్రజలే అని.. సీతారపురం గ్రామస్తులు చల్లగా ఉండాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని.. పనుల విషయంలో అధికారులు పర్యవేక్షణ తప్పని సరి


మిగతా 2లో..

## బిఆర్ఎస్‌కు మరో ఎంపి షాక్

### బిజెపిలో చేరిన జహీరాబాద్ ఎంపి పాటిల్




## ప్రజా నాడి




## దమ్ముంటే సిరిసిల్లలో రాజీనామా చేయ్

- నేను నల్లగొండలో రాజీనామా చేసి వస్తా
- బిఆర్ఎస్ నేత కెటిఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి సవాల్
- అవినీతి డబ్బుతో గెలిచిన అహంకారంలో కెటిఆర్
- మీడియా సమావేశంలో మంత్రుల విమర్శలు



హైదరాబాద్, మార్చి1 (ప్రజా మంటలు): మల్కాజిగిరిలో పోటీ చేసి గెలవాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ సిఎం రేవంత్ రెడ్డికి చేసిన సవాల్‌పై రాష్ట్ర మంత్రులు ఘాటు స్పందించారు. దమ్మంటే సిరిసిల్లలో రాజీనామా చేయి..మాల ఎవరో ఒకరు పోటీ చేస్తారని ప్రతిసవాల్ విసిరారు. వందలకోట్లు ఖర్చు పెట్టి అత్తెసరు మెజార్టీతో గెలిచిన కెటిఆర్ అహంకారంతో మాట్లాడు తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు కేటీఆర్ కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

మిగతా 2లో..

## ఇంటర్ విద్యార్థులకు గుడ్‌న్యూస్..

### నిమిషం నిబంధనపై కీలక నిర్ణయం తీసుకున్న బోర్డు



హైదరాబాద్, మార్చి1 (ప్రజా మంటలు): ఇంటర్ విద్యార్థులకు గుడ్‌న్యూస్. వార్షిక పరీక్షలకు హాజరయ్యే వారికి ఉన్న నిమిషం నిబంధనను ఇంటర్ బోర్డు సడలించింది. ఆలస్యంగా వచ్చే వారిని కూడా పరీక్షకు అనుమతించాలని కీలక నిర్ణయం తీసుకుంది. అయితే నిర్దిష్ట కారణాలతో పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా చేరుకునే వారిని 5 నిమిషాల గ్రేస్ పీరియడ్‌తో అనుమతించాలని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు ఇంటర్ బోర్డు సూచించింది. తాజా నిర్ణయంతో ఉదయం 9 గంటలు అంటే.. 9 : 05 గంటల వరకు

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

# మేడిగడ్డపై ఇంతకాలం నిజాలు దాచారు

## మంత్రి ఉత్తమ్ కుమార్ ఆగ్రహం

బీఆర్ఎస్ కాన్వాయ్‌లోని ఓ బస్సు టైర్ పగడంతో చిన్న అపశృతి చోటు చేసుకుంది. ఈ ఘటనపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెళ్తున్న బస్సు టైర్ పగిలింది అని చూశా. కారు టైర్లు అన్నీ మిగిలిపోయాయి. ఇక షెడ్డుకు పోవాల్సిందే' అంటూ మంత్రి సెటైరికల్ కామెంట్స్ చేశారు. 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ కుంగిపోయిందని.. తాము అధికారంలోకి వచ్చే వరకు కేసీఆర్ నోరు మెదపలేదన్నారు. నల్లగొండ సభలో ఏం మాట్లాడలని కేసీఆర్ వెళ్లారని ప్రశ్నించారు. తెలంగాణని నాశనం చేసి మళ్ళీ ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదన్నారు. మేడిగడ్డపై ఎన్‌డీఎస్ఏకు పూర్తిగా సహకరిస్తామని తెలిపారు. మేడిగడ్డ దగ్గరకి బ్యారేజీ తరలించేందుకే తుమ్మిడిహెట్టి దగ్గర నీటి లభ్యత తక్కువ అని కేసీఆర్ చెప్పారని.. సీడబ్ల్యూసీ చెప్పిందని కేసీఆర్ అబద్ధం చెప్పారని కేంద్రం చెప్తోందని అన్నారు. మేడిగడ్డపై విజిలెన్స్ నివేదిక త్వరలో వస్తుందని.. బాధ్యుల పేర్లతో సహా నివేదిక వస్తుందని తెలిపారు. నివేదిక అనుగుణంగా బాధ్యులపై చర్యలు ఉంటాయని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

# దొంగే..దొంగా అన్నట్లుగా ఉంది

మూడు పిల్లర్లే కదా కుంగిపోయిందని బీఆర్ఎస్ వితండవాదం చేస్తోందన్నారు. సాగు నీరు, ఇంజనీరు వ్యవస్థ సంక్షోభానికి గురైందన్నారు. ఫామ్ హౌస్ ప్రయోజనాల కోసం కేసీఆర్ ఇలాంటి పనులు చేశారని మండిపడ్డారు. మార్చిన డిజైన్‌లకు సీడబ్ల్యుసీ అనుమతి తీసుకోలేదన్నారు. పంప్ హౌస్‌ల లోకేషన్ మార్చండి లేకపోతే మునిగిపోతాయని సీడబ్ల్యుసీ హెచ్చరించినా పట్టించు కోలేదన్నారు. కేసీఆర్ దుర్మార్గమైన పాలన ఎప్పుడూ చూడలేదని... భవిష్యత్తులో కూడా చూడలేమన్నారు. రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేశారన్నారు. బీఆర్ఎస్ నేతలు మేడిగడ్డ సందర్శనకు వెళ్ళడం అంటే తమ తప్పులను తామే అద్దంలో చూసుకోవడమే అని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం (ఐజ్జీ÷బఠలిజీసజీప ఖసనీతీ।ఇఃబి) తప్పిదాలపై బీఆర్ఎస్ బహిరంగ చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. మిలియన్ మార్చ్ స్ఫూర్తితో మార్చి 10న చర్చకు రావాలన్నారు. బీఆర్ఎస్ చర్చకు తెర లేపిందని... చర్చకు టీజేఎస్ ముగింపు ఇస్తుందన్నారు. ఊరు ఊరు తిరిగి బీఆర్ఎస్ బండారం బట్టబయలు చేస్తామన్నారు. కాళేశ్వరం కామధేను ఎట్లా అయితుందో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కామధేను కాదు తెలంగాణ పాలిట గుదిబండ అంటూ కోదండరాం విరుచుకుపడ్డారు.

# చెప్పిందే చేస్తాం.. చేయగలిగేదే చెప్తాం

### ఇచ్చిన హామీలను అమలు చేసిచూపుతాం

### డిప్యూటి సిఎం మల్లు భట్టివిక్రమార్క

అని అన్నారు. ఇందిరమ్మ రాజ్యాంలో ఆరు గ్యారెంటీలు తప్పక అమలు చేసి తీరుతామన్నారు. రాష్ట్రంలో పేదలకు 2 వందల యూనిట్లు విద్యుత్, 5 వందలకే గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కలిపిస్తున్నామన్నారు. పేదల కోసం రూ.10 లక్షలతో ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలుచేయ బోతున్నట్లు తెలిపారు. మధిర నియోజకవర్గ ప్రజల ఓటుకు గౌరం తెచ్చే విధంగా పనిచేస్తామన్నారు. రాష్ట్ర ప్రజల కోసం ప్రభుత్వంలో మంత్రులుగా కంకణ బద్ధులై పనిచేస్తున్నామన్నారు. ఉద్యోగులను గత ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందని... కాంగ్రెస్ ప్రభుత్వం వారిని తిరిగి ఆదుకుంటుందని తెలిపారు. ప్రతి మాట.. ప్రతి వాగ్దానం నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. మహిళలను ఆర్థికంగా నిలబెట్టేందుకు రాష్ట్రంలో డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలను అందజేస్తామన్నారు. నిరుద్యోగులు గత ప్రభుత్వంలో ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడ్డారన్నారు. రూ.2.75 కోట్ల బడ్జెట్ రాష్ట్ర ప్రజల సమస్యలు పరిష్కరించాలనే ఉదేశ్యంతో ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన అతికొద్ది రోజుల్లోనే గ్రూప్ 1నోటిఫికేషన్ కూడా విడుదల చేశామన్నారు. రాష్టంలో ప్రతి బిడ్డ చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలనేదే ఈ ప్రభుత్వా లక్ష్యమన్నారు. ఈ రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాట.. ప్రతి వాగ్దానం నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎవరిని మోసం చేయాలని ఆలోచన తమకు లేదన్నారు. పదేళ్లు ప్రజలకు భ్రమలు కల్పించి పబ్బం కడుపుకోవాలనే ఆలోచన అంతకన్నా లేదన్నారు. వందేళ్ళ చరిత్ర కలిగిన ఈ పార్టీ మరో వందేళ్లు రాష్ట్రాన్ని, దేశాన్ని పాలన సాగించి ప్రజలకు అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రజలను మోసం చేసి పాలన సాగిస్తే రానున్న రోజులు ఇంటికి పంపిస్తారని.. ప్రజలకు అంకితమై పని చేయాలన్నది కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు.

# మేడిగడ్డలో చిన్న సమస్య ఏర్పడింది



సమస్య ఉందని తెలిపారు. ఇలాంటివి గతంలో ఎప్పుడూ జరగలేదన్నట్లు మాట్లాడడం సరికాదు. కాంగ్రెస్ హయాంలో కట్టిన కడెం, గుండ్లవాగు రెండుసార్లు కొట్టుకుపోయాయి. నాగార్జున సాగర్, శ్రీశైలంలోనూ లీకేజ్‌లు వచ్చాయి. సాగర్, శ్రీశైలంలో వచ్చిన లీకేజ్‌లను తాము రాజకీయం చేయలేదు. నిపుణుల సలహాలు తీసుకుని మేడిగడ్డను పునరుద్ధరించాలని కోరుతున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు. మేడిగడ్డలో చిన్న సమస్యను భూతద్దంలో పెట్టి పెద్దదిగా చూస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టే నిష్ఫలమైందని, దీని ద్వారా రూ. లక్ష కోట్లు కొట్టుకుపోయాయని దుష్ప్రచారం చేయడం సరికాదు. తమపై ఏదైనా కోపం, రాజకీయ వైరం ఉంటే తీర్చుకోండి. మేడిగడ్డను మరమ్మతులు చేయొచ్చని నిపుణులు చెప్పారు. అధికారులు, నిపుణులతో కమిటీ వేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. వరదలు వచ్చేలోగా మేడిగడ్డలో దిద్దుబాటు చర్యలు చేపట్టి, దాన్ని సురక్షితమైన స్థితికి తేవాలన్నారు. మేడిగడ్డ విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. సాగునీరు లేక ఇప్పటికే కరీంనగర్‌తో పాటు ఇతర జిల్లాల్లోనూ పంటలు ఎండిపోయే పరిస్థితులు వచ్చాయి. వానాకాలం లోగా రిపేర్లు పూర్తి చేసి రైతులకు నీళ్లు ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇదిలావుంటే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బరాజ్‌లో కుంగింది మూడు పిల్లర్లు మాత్రమే అని, వాటిని సరిచేసి వ్యవసాయానికి నీళ్లు ఇవ్వాలని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి సూచించారు. వ్యవసాయాన్ని రాజకీయాలతో ముడిపెట్టి.. రైతుల పొలాలను ఎండబెట్టొద్దు.. రైతాంగం ఉసురు పోసుకోవద్దు అని నిరంజన్ రెడ్డి అన్నారు. మేడిగడ్డ బరాజ్ సందర్శన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ బరాజ్ విషయంలో తప్పులు జరిగి ఉంటే ఉన్నతస్థాయి విచారణ జరిపి శిక్షలు పడేలా చూడాలి. కానీ రైతుల పొలాలను ఎండబెట్టకూడదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ ఒక బరాజ్ మాత్రమే. ఇది కాకుండా సుందిళ్ల, అన్నారం బరాజ్‌లు, పంప్ హౌస్‌లు, అండర్ గ్రౌండ్ టన్నెళ్లు, రిజర్వాయర్లు, ఓపెన్ కెనాళ్లతో 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సిస్టమ్ అభివృద్ధి చేసి ఉన్నదని తెలిపారు. వీటన్నింటినీ పక్కకు పెట్టి కుంగిన మూడు పిల్లర్లను చూపి ఇదే మొత్తం ప్రాజెక్ట్ అని దుర్బుద్ధితో దుష్ప్రచారం చేయడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని మేడిగడ్డను సరిచేయాలి. లేకుంటే గడపగడపకూ వెళ్లి రైతులను చైతన్యం చేస్తాం.. ఇంటికో వంద మందిని జమచేసి ఇంజనీర్ల సహకారంతో రైతులతోనే దీనిని రిపేర్ చేయించుకుంటాం. రాజకీయాన్ని, వ్యవసాయాన్ని కాంగ్రెస్ కలిపి చూడొద్దు.. ఏ ప్రభుత్వమైనా రైతుల కడగండ్లు తీర్చాలన్నారు. రైతుబంధు ఇవ్వకున్నా అప్పుచేసి సాగు చేశారు. ఇప్పుడు ఆ పంటలు ఎండిపోవడంతో రైతులు అవస్థపడుతున్నారు అని నిరంజన్ రెడ్డి తెలిపారు.నీటి లభ్యత కోసమే మేడిగడ్డ బరాజ్‌ను నిర్మించామని తెలిపారు. తుమ్మిడిహట్టిని వదిలిపెట్టింది అందుకే. ప్రాజెక్టు అంతిమలక్ష్యం రైతులకు సాగునీరు అందించడమే. 2007లో తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పించింది. నాడు కేంద్రంలో, రాష్ట్రంలో, పక్కన ఉన్న మహారాష్ట్రలో కూడా కాంగ్రెస్ అధికారంలో ఉన్నది. కానీ నాటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను మహారాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ తిరస్కరించిందని గుర్తు చేశారు. 2007 నుండి 2014 వరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క అనుమతి తీసుకోలేదు. అప్పుడు మంత్రిగా ఉన్న ఉత్తమ్ ఇప్పుడు కేసీఆర్ తుమ్మిడిహట్టి వద్ద కట్టాల్సి ఉండె అని మాట్లాడడం అత్యంత చెత్తగా, జుగుప్సాకరంగా ఉందని ధ్వజమెత్తారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అటు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని, ఇటు కేంద్రాన్ని ఒప్పించి.. కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డు సమయంలో నిర్మించారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రయోజనాలతో పాటు రైతులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని తెలిపారు. కాంగ్రెస్ మాదిరిగా ప్రాజెక్టుల నిర్మాణం దశాబ్దాల పాటు సాగదీయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని జీర్ణించుకోలేక లేని అభాండాలని వేసి రాజకీయ లబ్ది కొరకు సత్య దూరం మాటలు మాట్లాడటం సిగ్గు చేటు అని మండిపడ్డారు. అనవసర పంతాలకు పోయి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నోట్లో మట్టి కొట్టేందుకు ప్రయత్నం చేస్తుంది అని నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలనలో రైతులకు సకాలంలో నీళ్లు ఇచ్చారు. 24 గంటల ఉచిత కరెంట్ అందించారు. పంట పెట్టుబడి కూడా సాయం చేశారు. పండిన పంటను కొనుగోలు చేసి రైతుల ముఖాల్లో కేసీఆర్ సంతోషం చూశారని నిరంజన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మళ్లీ రైతులకు కరెంట్ కటకట, నీటికి కటకట, రైతుబంధుకు కటకట ఏర్పడింది. మూడెకరాల వరకు రైతుబంధు ఇచ్చేందుకు మూడు నెలల సమయం తీసుకున్నారు. కాంగ్రెస్ వచ్చాక ఏర్పడిన దుర్భర పరిస్థితులను రాష్ట్ర ప్రజలు గమనించాలి అని నిరంజన్ రెడ్డి సూచించారు.

# రైతు, ఎడ్యుకేషన్ కమిషన్లను ఏర్పాటు

### విద్యావిధానంపై కమిషన్ నిర్ణయం

### అఖిలపక్షంలో చర్చించి కౌలురైతులకు చేయూత

### పౌరసమాజం నేతలతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి



సీఎం రేవంత్ మాట్లాడుతూ... మన విద్యావిధానం ఎలా ఉండాలో ఎడ్యుకేషన్ కమిషన్ నిర్ణయిస్తుందని తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ధర్నా చౌక్‌ను తెరిచామని అన్నారు. ప్రజా భవన్ ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ప్రజా పాలన ద్వారా సంక్షేమ పథకాల దరఖాస్తులు స్వీకరించామన్నారు. 25 ఎకరాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ గురుకులాలను ఒకే ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లో ఏర్పాటు చేయనున్నా మన్నారు. పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్‌లో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కుల, మత వివక్షను పూర్తిగా తొలగించాలన్నదే వీటి ఉద్దేశమని చెప్పారు. పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయబోతున్నామని అన్నారు. పంట మార్పిడి పథకాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించామన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఉన్న చిక్కుముడులు తొలగించి ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. యూపీఎస్సీ తరహాలో టీఎస్పీఎస్సీ ద్వారా నియామకాలు చేపడతామని స్పష్టం చేశారు. కౌలు రైతుల రక్షణకు సంబంధించి అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని అన్నారు. అందరి సూచనలు , సలహాలు ఆధారంగా కౌలు రైతుల రక్షణకు చట్టం తీసుకురావాలని యోచిస్తున్నామని వివరించారు. రైతు భరోసా అనేది పెట్టుబడి సాయమని.. భరోసా ఎవరికి ఇవ్వాలనే దానిపై విస్తృత చర్చ జరగాలని కోరుతున్నామని అన్నారు. నిస్సహాయులకు, నిజమైన లబ్దిదారులకు అవసరమైతే చెప్పినదానికంటే ఎక్కువ సహాయం చేయొచ్చని వివరించారు.

# బెంగళూరులో భారీ పేలుడు




మంటలు చెలరేగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. రెస్టారెంట్‌లోని ఓ బ్యాగ్‌లో ఉంచిన వస్తువుకు పేలుడు స్వభావం ఉందని, అది పేలిపోయి ఉంటుందని భావిస్తున్నారు. సమచారం అందుకున్న బాంబ్ స్క్వాడ్ సిబ్బంది స్పాట్ కు చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తు న్నారు. మరోవైపు.. నగరంలోని 44 ప్రైవేట్ పాఠశాలలకు శుక్రవారం ఉదయం ఇ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. పాఠశాల ఆవరణలో పేలుడు పదార్థాలు అమర్చినట్లు ఇ-మెయిల్ లో పేర్కొన్నారు. వైట్‌ఫీల్డ్, కోరమంగళ, బస్వేష్‌నగర్, యలహంక, సదాశివనగర్ సహా బాంబు బెదిరింపు వచ్చిన అన్ని పాఠశాలలకు బాంబు స్క్వాడ్‌లను పంపించారు. విద్యార్థులను, సిబ్బందిని వెంటనే పాఠశాల నుంచి ఖాళీ చేయించారు. మేము ఇ-మెయిల్ లో పేర్కొన్న విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. తనిఖీ చేసేందుకు అవసరం అయిన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అయితే ఇంకా అనుమానాస్పద వస్తువులను స్వాధీనం చేసుకోలేదని అని కర్ణాటక హోంమంత్రి జి పరమేశ్వర్ వెల్లడించారు. 24 గంటల్లో మెయిల్ పంపిన వారిని పట్టుకుంటామని, ఈ ఘటనను సైబర్ క్రైమ్ పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు ఉన్నతాధికారులు వివరించారు. టెక్నాలజీ హబ్ బెంగళూరులోని రామేశ్వరం కేఫ్ లో జరిగిన ఘటనకు బాంబు పేలుడే కారణమని బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య న్నారు. కేఫ్ ఆవరణలో ఒక కస్టమర్ వదిలివెళ్లిన బ్యాగ్‌లోని పేలుడు పదార్ధమే ఇందుకు కారణమని, సిలెండర్ పేలుడు కాదని రామేశ్వరం కేఫ్ వ్యవస్థాపకుడు నాగరాజ్ తనకు తెలిపినట్టు చెప్పారు. ఈ ఘటనలో కేఫ్ సిబ్బంది ఒకరు గాయపడ్డారన్నారు. ఇది చాలా స్పష్టంగా బాంబు పేలుడు కేసుగా తెలుస్తోందని, దీనికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సమాధానం చెప్పాలని తేజస్వి సూర్య డిమాండ్ చేశారు. బెంగళూరు సౌత్ నియోజకవర్గానికి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. లంచ్ సమయంలో జరిగిన పేలుడు ఘటనలో ముగ్గురు కేఫ్ సిబ్బంది సహా తొమ్మిది మంది గాయపడ్డారు. దీంతో ఘటనా స్థలికి పోలీసు టీమ్‌తో పాటు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) చేరుకుంది. ఫోరెన్సిక్ టీమ్ కూడా రంగంలోకి దిగింది. పేలుడు అనంతరం ఎలాంటి మంటలు చెలరేగకపోవడంతో గ్యాస్ సిలిండర్ పేలినట్టు కనబడటం లేదని చెబుతున్నారు. పేలుడుకు ఐఈడీనే కారణమా అనే విషయంపై శాంపిల్స్ సేకరిస్తున్నామని, కేఫ్‌లో ఉంచిన బ్యాంగులోనే ఐఈడీ ఉంచారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని కర్ణాటక పోలీస్ చీఫ్ అలోక్ మోహన్ తెలిపారు. దీనిపై హోం డిపార్ట్‌మెంట్ అధికారికంగా సమాచారం ఇస్తుందని చెప్పారు. కాగా, పది సెకెండ్ల వ్యవధిలో రెండు పేలుళ్లు జరిగిన తనకు సమాచారం వచ్చినట్టు కేఫ్ కో-వ్యవస్థాపకురాలు దివ్య రాఘవేంద్రరావు తెలిపారు. వంటగదిలో ఎలాంటి పేలుడు జరగలేదన్నారు. కస్టమర్స్ చేతులు వాష్ చేసుకునే ప్రాంతంలో పేలుడు జరిగిందని, బహుశా అక్కడ ఉంచిన బ్యాగ్‌లో పేలుడు పదార్ధం ఉండొచ్చని చెప్పారు. గాయపడిన వ్యక్తులకు ఎలాంటి ప్రమాదం లేదని కూడా ఆమె తెలిపారు. కాగా, మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో పేలుడు జరగ్గానే అక్కడకు చేరుకున్నామని, నల్లటి పొగ కనిపించిందని, ఐదారుగురు గాయపడటంతో వారిని సమీప ఆసుపత్రికి తరలించారని సబరీష్ కుండలి అనే స్థానికుడు తెలిపారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ కాళేశ్వరం

కాంగ్రెస్‌కి కౌంటర్‌గా చలో మేడిగడ్డ చేపట్టింది బీఆర్ఎస్. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ నుంచి మేడిగడ్డకు బయల్దేరి వెళ్లింది బీఆర్ఎస్ బృందం. కేటీఆర్, హరీష్‌తోపాటు రెండు వందల మందికి పైగా ముఖ్యనేతలు, ఇరిగేషన్ నిపుణులు ఈ టీమ్‌లో ఉన్నారు. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను పరిశీలించనున్న బీఆర్ఎస్ బృందం.. అక్కడే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనుంది. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ..కాళేశ్వరంలో మొత్తం196 స్కీంలు.. ఉన్నాయి మూడు పిలర్లు కుంగితే భూతద్దంలో పెట్టి చూస్తున్నారన్నారు. కల్వకుర్తి ప్రాజెక్టు అసంపూర్తిగా ఉన్నా తామెన్నడు బ్లేమ్ చేయలేదన్నారు. కడియం ప్రాజెక్టు రెండు మార్లు తెగిందని.. అలా అని ఇప్పుడు మెడిగడ్డ కేవలం కుంగింది.. తెగలేదంటూ వివరించారు. రాజకీయాల కోసం రాజకీయ పబ్బం గడపడానికి రైతులను ఫణంగా పెట్టొద్దన్నారు. వచ్చే వర్ష కాలం కల్లా సుందిళ్ళ, అన్నారం, ఎల్లంపల్లి, కొండపోచమ్మ, మల్లన్న సాగర్లో నీటిని నింపాలంటూ డిమాండ్ చేశారు. గతం లో 40 ఏండ్లు అయినా ఒక్కో దగ్గర ప్రాజెక్టులు పూర్తి కాలేదు.. కానీ తాము కాళేశ్వరం మూడు ఏండ్లలో పూర్తి చేసినట్లు తెలిపారు. రైతు బంధు గతి లేదు ఇప్పటికి మూడు సార్లు పెండింగ్ లో పెట్టారంటూ కాంగ్రెస్ పై ÷ర్ అయ్యారు. నిజాలను నిగ్గుతేల్చి.. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడమే తమ లక్ష్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మేడిగడ్డ పర్యటనకు ముందు కేటీఆర్ తెలంగాణ భవన్ దగ్గర మాట్లాడారు. మేడిగడ్డను కూల్చాలని కాంగ్రెస్ కుట్ర చేస్తోందంటూ పేర్కొన్నారు. రిపేర్లు చేస్తే సరిపోయేదానికి ఇంత రాద్ధాంతం ఎందుకు? వర్షాకాలంలో ప్రాజెక్ట్ కొట్టుకుపోవాలని కాంగ్రెస్ అనుకుంటుందా? అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే రిపేర్లు మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బాధ్యత మరచి రాజకీయాలు చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. వాస్తవాలు చెప్పడానికే మా ఈ చలో మెడిగడ్డ పర్యటన అన్న కేటీఆర్.. రైతు ప్రయోజనం ముఖ్యం కాదు రాజకీయ ప్రయోజనం కాంగ్రెస్ పార్టీకి కావాలంటూ÷ర్ అయ్యారు. ఇవ్వాల చేస్తున్న మొదటి పర్యటన తర్వాత అన్ని ప్రాజెక్టులు పర్యటిస్తామన్నారు. రిపేర్ చేయడానికి ఇబ్బంది ఏంటని.. భాద్యుల పై చర్యలు తీసుకోవాలని.. రైతులను బలి చేయొద్దంటూ కోరారు.

# బిఆర్ఎస్ వ్యూహాత్మక విమర్శలు

### తెలంగాణకు బిజెపి చేసిందేమీ లేదన్న వాదన

**హైదరాబాద్, మార్చి1 (ప్రజా మంటలు):** బిజెపి,కాంగ్రెస్‌ల విషయంలో అధికార బిఆర్ఎస్ దూకుడుగా ముందుకు సాగుతోంది. ఈ రెండు పార్టీలను పార్లమెంట్ ఎన్నికల్లో తక్కువ చేసి గెలవాలన్న లక్ష్యంతో సాగుతోంది. పోయిన ఇమేజ్ కాపాడుకోవాలంటే పార్లమెంటులో సీట్లు గెలవాలి. తఇటీవల అవకాశం దొరికితే ఈ రెండు పార్టీలపై విరుచుకు పడుతోంది. అందుకే వాటిని లక్ష్యంగా చేసుకుని మాటల తూటాలు పేల్చుతోంది. కేంద్రం తెలంగాణకు ఏం చేయలేదన్న విమర్శలకు పదను పెట్టింది. 15 లక్షల నగదు.. ఉద్యోగాల భర్తీ ఏమైందని టీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. పనిలో పనిగా ఉద్యోగాల భర్తీపైనే ఎక్కువ ఫోకస్ పెట్టిన గులాబీ దళం బిజెపికి సవాల్ విసురుతోంది. విమర్శలకంటే తమహయాంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారం చేస్తున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేసిందీ వివరిస్తున్నారు. అలాగే బీజేపీని లక్ష్యంగా చేసుకుని వేడి పెంచుతున్నారు. విభజన చట్టంలో ప్రస్తావించిన హామీల అమలుపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. వీరందరికీ ఒకటే సమాధానంగా అభివృద్ధి మంత్రాన్ని వల్లె వేస్తున్నారు బిఆర్ఎస్ నేతలు. కేంద్రంలో రాబోయేది సంకీర్ణ యుగమేనని అందులో బిఆర్ఎస్ పాత్ర గొప్పగా ఉండబోతుందని ఆ పార్టీ నేతలు మరోమారు ఇప్పుడు చెబుతున్నారు. కేంద్రంలో రానున్నది సంకీర్ణ ప్రభుత్వమేనన్నారు. బిఆర్ఎస్ దేశంలో కేంద్రంలో కీలక భూమిక పోషిస్తామంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంకీర్ణ ప్రభుత్వాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. గత 25 ఏళ్లుగా కాంగ్రెస్‌కు కేంద్రంలో మెజార్టీ లేదన్నారు. రాబోయే రోజుల్లో సీఎం కేసీఆర్ ఢిల్లీలో చక్రం తిప్పబోతున్నట్లు పార్లమెంట్ ఎన్నికల వేళ పేర్కొన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, నిధులను సాధించాలంటే ఢిల్లీలో మన బలం చూపించాలనీ పేర్కొన్నారు. మన బలం తెలిసి చక్రం తిప్పగలుగు తామనీ, రాష్ట్ర ప్రయోజనాలు సాధించగలమని పేర్కొన్నారు. కేంద్రంలో మార్పు అన్నది రాజ్యాధికారం కోసమో, పదవుల కోసమో కాదని, దేశ అభ్యున్నతి కోసం అని చెప్పారు. కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టులకు అనుమతుల కోసం అనేక సార్లు కేంద్ర మంత్రులు, అధికారులను కలిశామని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయం వల్ల తెలంగాణ ప్రాజెక్టులకు జాతీయ హోదా రాలేదని విమర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ టీఆర్ఎస్‌ను గెలిపించుకొని పార్టీని మరింత బలోపేతం చేసుకునే దిశగా కృషి చేయాలన్నారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు తప్పక గుర్తింపు ఉంటుందని అన్నారు.

# రాజకీయ భిక్ష పెట్టిన పాలమూరుకే వెన్నుపోటు

### కృష్ణాజలాలు సీమకు తరలించినా పట్టని కెసిఆర్

### కాంగ్రెస్ నేత వంశీచంద్ రెడ్డి ఘాటు విమర్శలు

**మహబూబ్‌నగర్,మార్చి1 (ప్రజా మంటలు):** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిన పాలమూరు జిల్లాను తీవ్ర అన్యాయం చేశారని, కృష్ణాజలాలను ఆంధ్ర పాలకులు దోచుకుపోతుంటే దద్దమ్మలా కేసీఆర్ చూస్తుండిపోయారని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు వంశీచంద్ రెడ్డి విమర్శించారు. అధికారంలో ఉండగా ఒకనీతి, ఇప్పుడో నీతి అనుసరిస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన మహబూబ్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కృష్ణ బేసిన్ నీటిని పెన్నా బేసిన్‌కు ఆంధ్ర నాయకులు తీసుకుపోతున్నా కేసీఆర్ అడ్డుపడలేదని ఆరోపించారు. మూడేళ్ళలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారని, తొమ్మిదేళ్లయినా పనులు పూర్తి కాలేదన్నారు. ప్రాజెక్టు పొడవునా నాసిరకం పనులు జరుగుతున్నాయని, కేసీఆర్ దక్షిణ తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపించారని విమర్శించారు. కృష్ణా నదిలో తెలంగాణకు రావలసిన వాటాపై పోరాటం చేయలేదన్నారు. నాడు కేసీఆర్ స్థానంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే 299 టీఎంసీలకు బదులుగా 577 టీఎంసీల వాటా వచ్చేదన్నారు. కేసీఆర్ డిజైన్ చేసిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ కుంగిపోయిందన్నారు. ఉత్తర తెలంగాణలో లక్షల కోట్ల అవినీతి చేసి మేడిగడ్డను బొందల గడ్డగా మార్చారని, దక్షిణ తెలంగాణను మోసం చేశారని వంశీచంద్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. ఇదిలావుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల ఆరున పాలమూరుకు రానున్నారు.. జిల్లా కేంద్రంలో బహిరంగసభ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అధికారికంగా ప్రకటన ఇంకా రాకపోయినా పార్టీశ్రేణులు మాత్రం దాదాపుగా ఖరారు అయినట్లుగానే చెబుతున్నారు. ఇందుకోసం ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు స్థల పరిశీలన చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నిక ఉన్నందున ముఖ్యమంత్రి భారీ సభ నిర్వహించాలని నిర్ణయించిన ట్లు తెలిసింది. అదేరోజు ప్రముఖ పారిశ్రామిక వేత్త మన్నె జీవన్‌రెడ్డి, ఆయన అనుచరులు పెద్దఎత్తున సీఎం సమక్షంలో పార్టీలో చేరనున్నట్లు సమాచారం. మరోవైపు సీఎం పర్యటన నేపథ్యంలో పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. సభ నిర్వహించే స్థలం ఫైనల్ అయితే బందోబస్తు పరంగా చర్యలు తీసుకోకున్నారు.

# రాడిసన్ డ్రగ్స్ కేసు

### హైకోర్టులో క్రిష్ ముందస్తు బెయిల్ దాఖలు

**హైదరాబాద్,మార్చి1 (ప్రజా మంటలు):** : హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన రాడిసన్ డ్రగ్స్ కేసు ఊహించని మలుపులు తిరుగుతోంది. ఈ డ్రగ్స్ పార్టీలో టాలీవుడ్ సినీ డైరెక్టర్ జాగర్లమూడి క్రిష్ కూడా ఉన్నట్టు పోలీసులు పేర్కొన్న విషయం తెలిసిందే. ఇక క్రిష్ ను విచారించేందుకు పోలీసులు సిద్ధం అయ్యారు. క్రిష్ వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాల్సిందేనని పోలీసులు తెలిపారు. అయితే గచ్చిబౌలి పోలీసుల విచారణకు హాజరుకాకుండా హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు క్రిష్. ఇక ఈ పిటిషన్‌లో వివేకానంద ఇచ్చిన స్టేట్‌మెంట్‌తో నన్ను నిందితుడిగా చేర్చారని క్రిష్ పేర్కొన్నాడు. నాకు డ్రగ్స్ పార్టీతో సంబంధమే లేదు. నేను డ్రగ్స్ తీసుకున్నాననడానికి ఆధారాలు లేవు. కావాలనే నన్ను ఈ కేసులో ఇరికించారు. ప్రస్తుతం తాను ముంబైలో ఉన్న కారణంగా పోలీసుల విచారణకు రాలేనని, మరో రెండు రోజుల సమయం కావాలని కోరారు. దీంతో ఈ ముందస్తు బెయిల్‌పై ప్రస్తుతం హైకోర్టులో విచారణ జరుగుతుంది.

# లాస్యనందిత రోడ్డు ప్రమాదం

### టిప్పర్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్న పోలీసులు

**హైదరాబాద్,మార్చి1 (ప్రజా మంటలు):** కంటోన్మెంట్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదం కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. గత నెల 23వ తేదీ తెల్లవారుజామున పటాన్‌చెరు సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో లాస్య ప్రయాణిస్తున్న కారు రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన లాస్య.. ఘటనా స్థలంలోనే మృతి చెందారు. అయితే, ఆమె ప్రయాణిస్తున్న కారు ముందుగా టిప్పర్‌ను ఢీకొని ఆ తర్వాత రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌ను ఢీకొన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. తాజాగా, ఓఆర్ఆర్‌పై ఆమె వాహనాన్ని ఢీకొన్న టిప్పర్‌ను పటాన్‌చెరు పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలిలో రికార్డయిన సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఆ టిప్పర్‌ను గుర్తించి, సీజ్ చేశారు. దానిని నడిపిన డ్రైవర్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లాస్య కారును ఆమె పీఏ ఆకాశ్.. నిద్రమత్తులో నడిపినట్టు తెలుస్తుంది. ముందుగా టిప్పర్.. కారును ఢకొందా లేదా కారు టిప్పర్‌ను వెనక నుంచి ఢకొ?ట్టడం వల్ల ప్రమాదం జరిగిందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు లోతుగా విచారిస్తున్నట్లు తెలుస్తుంది.


# దమ్ముంటే సిరిసిల్లలో రాజీనామా చేయ్

సవాల్ విసిరారు. తాను నల్లగొండ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, కేటీఆర్ఎస్ కూడా రిజైన్ చేయాలన్నారు. సిరిసిల్లలో తాను పోటీ చేసి గెలుస్తానని, అలా అయితే కారు షెడ్డు మూసుకుంటారా..? అని ప్రశ్నించారు. కేటీఆర్ ఓడితే పార్టీ క్లోజ్ చేస్తానని ప్రకటించేందుకు కేసీఆర్ సిద్ధమా? అని ప్రశ్నించారు. తాను సిరిసిల్లలో ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. కేటీఆర్ కు టెక్నికల్ నాలెడ్జ్ లేదని చెప్పారు. కేటీఆర్ ఓ చిన్న పిలగాడని, తన స్థాయి కేటీఆర్ ది కాదని అన్నారు. కేటీఆర్ కు క్యారెక్టర్ లేదని, లక్షల కోట్లు మాత్రమే ఉన్నాయని విమర్శించారు. కేటీఆర్ 200 కోట్లు ఖర్చు పెట్టి కేవలం 30 వేల ఓట్ల మెజార్టీతో గెలిచారని, తానైతే రాజీనామా చేసేవాడినని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ.. బండి సంజయ్, అర్వింద్ పెద్ద లీడర్లు అనుకుంటున్నారని, ఎంపీ ఎన్నికల తర్వాత పిచ్చి లేసి పోతారని అన్నారు. వీళ్లిద్దరూ పొలిటికల్ లీడర్లు కాదని గాల్లో గెలిచారన్నారు. బ్రేకింగ్ కోసం మాత్రమే మాట్లాడుతారని విమర్శించారు. ఆ నలుగురు ఎంపీలు రాష్ట్రం కోసం ఎప్పుడూ పార్లమెంట్ లో మాట్లాడలేదని అన్నారు. దమ్ముంటే కరీంనగర్ లో కేటీఆర్ పోటీ చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. ముందు కరీంనగర్ లో తమపై గెలిచి చూపించి మాట్లాడాలన్నారు. కేసీఆర్ మానసపుత్రిక బొందలగడ్డగా మారడానికి కారణం ఎవరు చెప్పాలన్నారు. మేడిగడ్డలో ఒకట్రెండు పిల్లర్లే కుంగాయంటూ అవహేళన చేస్తున్నారని విమర్శించారు. ఇంట్లో ఒక పిల్లర్ కూలినా ఇల్లు కూలిపోయినట్లేనన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నామన్నారు పొన్నం ప్రభాకర్. ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే నాలుగు హామీలు అమలు చేశామన్నారు. ఇది చూసిన బీఆర్ఎస్ నేతలకు కళ్లు మండుతున్నాయని..అందుకే ఏదేదో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అధికారం కోల్పోయే సరికి కేటీఆర్ మతి భ్రమించినట్లు మాట్లాడుతు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ గెలుపును జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు.

# ఇంటర్ విద్యార్థులకు గుడ్‌న్యూస్..

### నిమిషం నిబంధనపై కీలక నిర్ణయం తీసుకున్న బోర్డు

విద్యార్థులను పరీక్షకు అనుమతిస్తారు. అయితే, ఇంటర్ వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 8 : 45 గంటల లోపే పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని ఇంటర్ బోర్డు సూచించింది. నిమిషం నిబంధన కారణంగా ఆదిలాబాద్ జిల్లాలో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. పరీక్షాకేంద్రానికి సమయానికి చేరుకోలేకపోవడంతో విద్యార్థి శివకుమార్‌ను పరీక్ష రాసేందుకు అధికారులు అనుమతించలేదు. దీంతో మనస్తాపం చెందిన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సంచలనంగా మారడంతో తాజాగా ఐదు నిమిషాల వెసులుబాటు కల్పిస్తూ ఇంటర్‌బోర్డు శుక్రవారం అధికారిక ప్రకటనను విడుదల చేసింది.







# నీళ్లు లేక ఎండిపోతున్న పొలాలు చోద్యం చూస్తున్న అధికారులు

## అరిగోస పడుతున్న రైతన్నలు, ప్రజలు

ఎల్కతుర్తి మార్చ్ 01 (ప్రజామంటలు):
ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాలలో తలాపున ఉన్న దేవాదుల ప్రాజెక్టుతో రి0డే ధర్మసాగరం చెరువు పైన ఉన్నప్పటికీ అందులో నుంచి కాలువల ద్వారా మండలములోని దామెర గోపాల్పూర్ చింతలపల్లి ఇంద్రానగర్ జిలుగుల వరకు త్రాగునీరు కానీ సాగునీరు కానీ లేకుండా రైతులు ఇబ్బంది పడకుండా చూడవలసిన అధికారులు చోద్యం చూస్తున్నారని రైతులు వాపోతున్నారు ఏ రాజకీయ నాయకులు వచ్చిన మా పార్టీకి ఓటు వేయండి అని అడగడమే కానీ రైతుల పక్షాన నిలబడి నీరు అందించే నాధుడే లేదని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంలో ఉన్న నాయకులు కానీ స్పందించి అధికారులు కానీ కాలువల ద్వారా ఈ పైన ఉన్న గ్రామాలలో ఉన్న చెరువులు నింపేది ఉంటే వచ్చేది వేసవికాలం కాబట్టి రైతులకు గ్రామాలలో త్రాగునీరుకు సాగునీరుకు ఏ కొదవ ఉండదని అధికారులు వెంటనే స్పందించి కాలువలు రిపేరు చేసి చెరువులు నింపాలని రైతులు కోరుకుంటున్నారు.

మొదటి పేజీ తరువాయి

# బిఆర్ఎస్‌కు మరో ఎంపి షాక్

## బిజెపిలో చేరిన జహీరాబాద్ ఎంపి పాటిల్

న్యూఢిల్లీ,మార్చి1 (ప్రజామంటలు):
పార్లమెంట్ ఎన్నికల ముంగిట బీఆర్ఎస్‌కు మరో బిగ్ షాక్ తగిలింది. గులాబీ పార్టీకు జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ రాజీనామా చేశారు. ఇప్పటికే నాగర్ కర్నూలు ఎంపి రాములు బిజెపిలో చేరారు. తాజాగా మరో ఎంపి చేరారు. ఢిల్లీలోని బీజేపీ జాతీయ కార్యాలయంలో కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సమక్షంలో ఎంపీ బీబీ పాటిల్ కాషాయ కండువా కప్పుకున్నారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు పంపించారు. ఆయన బీజేపీలో చేరడంతో సంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 2014, 2019 ఎన్నికల్లో రెండుసార్లు పాటిల్ ఎంపీగా గెలుపొందారు. గత కొంతకాలంగా బీఆర్ఎస్ హై కమాండ్‌పై బీబీపాటిల్ అసంతృప్తితో ఉన్నారు. కేసీఆర్ తీరుపై కూడా ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కాషాయ పార్టీలో చేరితేనే తనకు రాజకీయంగా భవిష్యత్తు ఉంటుందని భావించిన బీబీపాటిల్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కాగా.. బీబీ పాటిల్ బీజేపీలో చేరడంపై ఆ పార్టీ ఎంపీ లక్ష్మణ్(ఓఖ ఒజీలీపజీని) స్పందించారు. బీబీ పాటిల్ బీజేపీలో చేరడాన్ని స్వాగతిస్తున్నానని లక్ష్మణ్ అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభివృద్ధి మోడల్ నచ్చి నేతలు బీజేపీలో చేరుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ నుంచి రోజుకో వికెట్ కోల్పోతుందని చెప్పారు. ఆ పార్టీ రెక్కలు తెగిన పక్షిలా తయారైందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు బయటకు కత్తులు దుస్తున్నట్లు నటిస్తూ బీజేపీ బలోపేతన్ని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. రెండు పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణలో బీజేపీ బలోపేతన్ని అడ్డుకోలేవని చెప్పారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో 17 స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని లక్ష్మణ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# మద్దెలగూడెం కు బస్సు కావాలని మంత్రి పొన్నం కలిసిన ఎంపీటీసీ

వేలేరు మార్చ్ 01 (ప్రజామంటలు):
వేలేర్ మండలం పిచర మరియు మద్దెలగూడెం గ్రామస్తులు శుక్రవారం హైదరాబాద్ ప్రగతి సెక్రటరీ భవనంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని మా విలేజ్ కి ఆర్టీసీ బస్సు కావాలని వినతి పత్రం ఇచ్చిన ఎంపిటిసి సంపత్ హుస్నాబాద్ డిపో బస్సు ముల్కనూర్ కొత్తకొండ వేలేర్ పిచర మద్దెల గూడెం తరిగెప్పుల వరకు బస్సు కావాలని ఎంపీటీసీ సంపత్ కూరగా ఉన్నతాధికాలతోని మాట్లాడి బస్సు ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపినట్టు ఎంపిటిసి సంపత్ తెలిపారు ఈ కార్యక్రమంలో మద్దలగూడెం సోషల్ మీడియా పరికి రవీందర్, ఎంపిటిసి సంపత్ యాదవ్, మండల సంపత్ కుమార్ యాదవ్, శివరాత్రి దుర్గయ్య పాల్గొన్నారు.





## అదనపు తరగతి గదులు నిర్మించాలని మంత్రి పొన్నం కు వినతి

సికింద్రాబాద్ మార్చ్ 01 (ప్రజామంటలు):
బన్సీలాల్ పేట డివిజన్ భోలక్ పూర్ లోని మేకల మండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో హై స్కూల్ బిల్డింగ్ నిర్మాణం కోసం రూ 65 లక్షల అదనపు నిధులు మంజూరు చేయాలని స్కూల్ కమిటీ సభ్యులు జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కోరారు. శుక్రవారం ఉన్నత పాఠశాల సాధన కమిటీ సభ్యులు ఈ. చంద్రశేఖర్, వీజే శేషగిరిరావు, హెడ్మాస్టర్ మల్లికార్జున్ రెడ్డి మంత్రిని కలసి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



# కాంగ్రెస్ సర్కార్‌కు చిప్పచేతికిచ్చిన బిఆర్ఎస్ కాలేశ్వరంపై విమర్శలే తప్ప చర్యలేవీ

## మాజీ ఎంపి, బిజెపి నేత కొండా విశ్వేశ్వర్ రెడ్డి

హైదరాబాద్,మార్చ్ 01 (ప్రజామంటలు):



కొత్త ప్రభుత్వం చేతిలో బీఆర్ఎస్ సర్కార్ చిప్ప పెట్టిపోయిందని, బీజేపీ నేత కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు.
ఎఫ్ఆర్‌బీఎం పరిధి మించిపోయినా కొత్తగా అప్పు తీసుకునేందుకు మోదీ అవకాశం ఇచ్చారని అన్నారు. రాష్ట్రం ఆర్థికంగా నడుస్తోందంటే కారణం ప్రధానేనని, పార్లమెంట్ ఎన్నికల్లో మోదీకి ఓటేయాలని మేము గర్వంగా అడుగుతామన్నారు. కాళేశ్వరంపై చర్చ చేస్తున్నారు.. కానీ చర్యలు తీసుకోవడం లేదని, కాళేశ్వరం మొత్తం వదిలేసి కేవలం మేడిగడ్డను పట్టుకున్నారని విమర్శించారు.
కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌ను కాపాడుతోందని, బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తులు ఉండవని.. మేము ఎవరితోనూ పొత్తు పెట్టుకోమని కొండా విశ్వేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గ్రామీణ అభివృద్ధి కూడా మోదీ వల్లనే జరుగుతోందని, రూ. 9 వేల కోట్ల అప్పు ఇవ్వలేకపోతే రాష్ట్రం చీకట్లోకి వెళ్ళేదని కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. కాంగ్రెస్ వాళ్ళు రాహుల్ గాంధీకి ఓటేయాలని అడగలేరని, తెలంగాణలో బీజేపీకి ఎక్కువ సీట్లు ఇస్తే నిధులు తెచ్చుకునే అవకాశం ఉంటుందన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డి ని కలిస్తే కాంగ్రెస్‌లో చేరతున్నారని దుష్ప్రచారం చేశారని, సీఎం, మంత్రులు మోదీని కలిసినందున.. వారు కూడా బీజేపీలో చేరతారా? అని ప్రశ్నించారు. చేవెళ్లలో బీజేపీ 2 లక్షల మెజారిటీ ఓట్లతో గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర
కాంగ్రెస్ నేతల మాటలను ఆ పార్టీ అధిష్టానం వినడం లేదని, కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని అంటున్నా.. కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ఒప్పుకోవడం లేదన్నారు. తనకు చేవెళ్ళ టికెట్ వచ్చినా.. రాకపోయినా పార్టీ కోసం పనిచేస్తానని.. టికెట్ ఇస్తామని తనకు కూడా ఎవరూ ఎలాంటి గ్యారెంటీ ఇవ్వలేదని కొండా విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. 65 శాతం మంది ముస్లింలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పథకాలతో లబ్ది చేకూరుతుందని విశ్వేశ్వరరెడ్డి వ్యాఖ్యానించారు.

# పరకాలలో పోలీసులు వేధించారు

## జిల్లా ఎస్పీతో మాట్లాడిన కెటిఆర్

వరంగల్, మార్చ్ 01 (ప్రజామంటలు): పరకాలలో జై తెలంగాణ అన్నందుకు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆరోపిస్తూ.. పోలీసుల తీరుపైన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. పరకాల ఘటనలో గాయపడిన పార్టీ కార్యకర్తలను చలో మేడిగడ్డకు వెళుతున్న సందర్భంగా మార్గమధ్యలో కలిసి పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు ఇంత దారుణంగా వ్యవహరించడం పై మండిపడ్డారు. వెంటనే జిల్లా ఎస్పీ అంబర్షాతో ఫోన్‌లో మాట్లాడారు. కొంతమంది స్థానిక పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ.. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని తప్పుబట్టారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని పోలీసులు చట్టబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని, ఉద్యమంలో ఇలాంటి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడ్డ పార్టీ మనదని గుర్తుచేశారు. స్థానిక పోలీస్ అధికారిని సస్పెండ్ చేసినా, పార్టీ కార్యకర్తలపైన పోలీసుల దమనకాండ ఆగడం లేదని ఈ సందర్భంగా పరకాల నేతలు కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. పరకాలలో బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్షగట్టిన పోలీసులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని తెలిపారు. ఢిల్లీ వరకు వెళతామని, న్యాయస్థానాలతోపాటు మానవహక్కుల సంఘాలను ఆశ్రయించి వారిపై చర్యలు తీసుకునే వరకూ పోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ స్పష్టంచేశారు. పరకాల వంటి సంఘటనలు రాష్ట్రంలో ఎక్కడ పునరావృతమైనా పార్టీ యంత్రాంగం చూస్తూ ఊరుకోబోదమని కేటీఆర్ స్పష్టంచేశారు.

# పేలిన బస్సు టైర్

## బిఆర్ఎస్ నేతల కాన్వాయ్‌కు తప్పిన ప్రమాదం

జనగామ,, మార్చ్ 01 (ప్రజామంటలు): చలో మేడిగడ్డ పర్యటనలో భాగంగా కాళేశ్వరం బయలుదేరిన బీఆర్ఎస్ నేతల కాన్వాయ్‌కు పెను ప్రమాదం తప్పింది. జనగామ మండలం నెల్లుట్ల సమీపంలో బీఆర్ఎస్ నేతల కాన్వాయ్‌లో ఓ బస్సు టైర్ పేలింది. దీంతో బస్సును పక్కకు నిలిపి వేశారు. ఆపై బస్సులోని బీఆర్ఎస్ నేతలంతా కార్లలో బయలుదేరారు. బస్సులో ఆందోల్ మాజీ ఎమ్మెల్యే కాంతికిరణ్ సహా పలువురు నేతలు ఉన్నారు. అయితే పెను ప్రమాదం తప్పడంతో గులాబీ నేతలు ఊరిపీల్చుకున్నారు. మరోవైపు బీఆర్ఎస్ నేతల బస్సు యాత్ర జనగామ చేరుకుంది. మేడిగడ్డ సందర్శనకు బయలుదేరిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బృందానికి పెంబర్తి ఆర్చి వద్ద జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీమంత్రి దయాకర్ రావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్వాగతం పలికారు.

## ఎస్టీయూ సీనియర్ నాయకులు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆకుబత్తిని వెంకట్రాజం మృతి

సైదాపూర్ మార్చ్ 01 (ప్రజామంటలు):



సైదాపూర్ మండలంలోని ఏక్లాస్ పూర్ గ్రామానికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఎస్టియు నాయకులుగా, హిందీ ఉపాధ్యాయులుగా ఉపాధ్యాయవర్గానికి, విద్యా రంగానికి విశేష సేవలందించిన ఆకుబత్తిని వెంకట్రాజం అనారోగ్యం కారణంగా బుధవారం మరణించారు. ఆయన మృతి పట్ల ఎస్టీయూ జిల్లా, రాష్ట్ర నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి వారి మృతి పట్ల గురువారం సంతాపం ప్రకటించారు. భీమదేవరపల్లి సమితి బాధ్యులుగా జిల్లా కార్యవర్గ సభ్యులుగా, రాష్ట్ర బాధ్యులుగా మూడు దశాబ్దాలకు పైగా ఉపాధ్యాయుల సంక్షేమం కొరకు వారి హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేశారని ఎస్టీయూ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి. ఆర్. శ్రీనివాస్, కట్టా రవీంద్రాచారి, జిల్లా నాయకులు యెనగంటి బాలాజీ, కోట శ్యాంకుమార్, పురుషోత్తం మూర్తి, రాజ్ కుమార్, శ్రీనివాస్, శివకుమార్, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హార్వెస్టర్ కరెంటు తీగలకు తగిలి గడ్డివాము దగ్ధం తప్పిన పెను ప్రమాదం

కరెంటు తీగలను తప్పించబోయి పంట పొలాల్లో దూసుకెళ్లిన ఆటో

స్వల్ప గాయాలతో బయటపడ్డ ప్రయాణికులు

విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకోలేదని గ్రామస్తుల ఆవేదన

భీమదేవరపల్లి మార్చ్ 01 (ప్రజామంటలు):



మండలంలోని ముస్తఫాపూర్ – గట్ల నర్సింగాపూర్ (కొత్తపల్లె) గ్రామాల మధ్య హార్వెస్టర్ కరెంటు తీగలకు తగలడంతో తీగలు తెగి గడ్డివాము దగ్ధమైనది. అదే సమయంలో అటుగా వస్తున్న ప్రయాణికులతో నిండిన ఆటో కరెంటు తీగలను తప్పించబోయి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. కరెంటు తీగలు తెగిపోవడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. విద్యుత్ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాలు కోసే సీజన్ అని, విద్యుత్ తీగలు కిందికి ఉండడంతో ప్రాణాలకు ప్రమాదం ఉందని చెప్పినట్లు మాజీ ఎంపీటీసీ తాళ్లపల్లి జయంత్ అన్నారు. వాహనాల రాక తక్కువగా ఉండడంతో పెను ప్రమాదం తప్పినట్లు గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

**విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకోలేదు మాజీ ఎంపీటీసీ తాళ్లపల్లి జయంత్**



పంట పొలాలలో విద్యుత్ తీగలు కిందికి జారి ఉండడం వలన హార్వెస్టర్ తో ప్రమాదం ఉంటుందని వీటిని సరిచేయాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు తెలియజేపినప్పటికిని నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు.

# సింగపురం ఇంద్రను కలిసిన కాంగ్రెస్ నాయకులు



వేలేరు మార్చ్ 01 (ప్రజామంటలు):
వేలేరు మండల నుంచి స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గం ఇంచార్జ్ టిపిసిసి ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిరక్క ని వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తి సంపత్ మాజీ ఉపసర్పంచ్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఎన్నుకోబడినcగామ కాంcగెస్ పార్టీ అధ్యక్షుడు కారం శ్రీనివాస్ రెడ్డి ఇందిరక్క ను కలిసి శాలువాతో సన్మానించి బొకే ఇచ్చి కలవడం జరిగింది పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునేందుకు కృషి చేస్తానని చెప్పడం జరిగింది కారంcశీనువాస్ రెడ్డి వారి పదవి సహకరించిన ఇందిరక్క కు కృతజ్ఞతలు తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో జనగాం జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్ రెడ్డి ఉమ్మడి మండల మాజీ జెడ్పిటిసి కీర్తి వెంకటేశ్వర్లు కన్నెబోయిన సంపత్ సలీంమాలిక్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు మిలుకూరి మధు శాలపల్లి అధ్యక్షులు శంకర్ కన్నబోయిన (బక్క) సంపత్ పెద్ద వెంకన్న కూటికి మొగిలి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డితో రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య భేటీ

**బీ.సీ. ఓవర్సీస్ స్కాలర్షిప్ నిధులు విడుదల చేయాలి**

**స్కాలర్షిప్ సంఖ్యను పెంచాలి**

**టెట్ పరీక్షలు నిర్వహించాలి**

**ఫీ రీయింబర్స్ మెంట్ నిధులు విడుదల చేయాలి**

**చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేసిన ఆర్. కృష్ణయ్య**

హైదరాబాద్ మార్చ్ 01 (ప్రజామంటలు):
రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డితో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య శుక్రవారం ప్రజా భవన్ లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థుల పలు అంశాలపై రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి ఆర్ కృష్ణయ్య వినతి పత్రాలను అందజేశారు. బీసీ విద్యార్థులకు అందజేస్తున్న విదేశీ విద్య స్కాలర్షిప్ సంఖ్యను 300 నుంచి కనీసం 1000 మందికి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన చిన్నారెడ్డిని కోరారు. బీసీ ఓవర్సీస్ స్కాలర్షిప్ మంజూరై విదేశాల్లో ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు నిధులను వెంటనే విడుదల చేయాలని ఆర్ కృష్ణయ్య కోరారు. 11 వేల టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో బీ.ఇడీ, డీ.ఇడీ పూర్తిచేసిన దాదాపు నాలుగు లక్షల మంది విద్యార్థులకు టెట్ పరీక్షలు నిర్వహించాలని, అందుకు నోటిఫికేషన్ జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన చిన్నారెడ్డిని కోరారు. టెట్ పరీక్ష పాస్ అయితే తప్ప డీఎస్సీ పరీక్షకు అర్హత ఉండదని ఆయన గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులకు గత మూడు సంవత్సరాల నుంచి ఫీజు రియంబర్స్మెంట్ ప్రభుత్వం మంజూరు చేయడం లేదని, దీంతో విద్యార్థులకు సొంతంగా ఫీజులు చెల్లించాలని కాలేజీల యాజమాన్యాలు ఒత్తిడి పెంచుతూ వేధింపులకు గురి చేస్తున్నారని ఆర్ కృష్ణయ్య రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. గత మూడేళ్లుగా పెండింగ్లో ఉన్న 4000 కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్మెంట్లు వెంటనే విడుదల చేయించేందుకు చర్యలు తీసుకోవాలని చిన్నారెడ్డిని కృష్ణయ్య కోరారు. ఈ భేటీలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, అనంతయ్య, రాజేందర్, రామకృష్ణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.



# సీనియర్ కాంగ్రెస్ నేత పెంటయ్య మృతి

**సంతాపం తెలిపిన మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి**

సికింద్రాబాద్ మార్చ్ 01 (ప్రజామంటలు):



సనత్ నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు యాదగిరి పెంటయ్య (94) అలియాస్ కొబ్బరికాయల పెంటయ్య శుక్రవారం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎన్.డీ.ఎమ్.ఏ. మాజీ వైస్ ప్రెసిడెంట్ మర్రి శశిధర్ రెడ్డి మోండా మార్కెట్ లోని పెంటయ్య ఇంటికి చేరుకొని పార్థివ దేహాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. పెంటయ్య కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. మర్రి శశిధర్ రెడ్డి వెంట నాయకులు అశోక్ చారి, వికాస్, ప్రకాశ్, తారాచంద్, గుంటి సత్యనారాయణ పాల్గొన్నారు.

# తప్పుచేసిన వారే అరచిగీపెడతారు !

నోరున్నోడిదే ఊరు..బడితె ఉన్నోడిదే బర్రె..ఈ సామెత బిఆర్ఎస్‌కు బాగా సరిపోతుంది. నోరు పెద్దది చేయడం ద్వారా పదేళ్ల పాపాలను కప్పిపుచ్చుకోవాలని చూస్తోంది. తప్పుచేసిన వాళ్లే గాయ్ గాయ్ చేస్తారు. అరిచి గీపెడతారు. పెడబొబ్బలు పెడతారు. ఇప్పుడు బిఆర్ఎస్ నేతలు అదే చేస్తున్నారు. ఇంతకాలం తమదే అధికారం అనుకున్నారు. జీవితాంతం తామే అధికారంలో ఉంటామని అనుకున్నారు. తండ్రి తరవాత తనయుడే సిఎం అవుతాడని భావించారు. గడీల రాజ్యం నెలకొల్పి దానిని కొనసాగిద్దా మనుకున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల దెబ్బతో ..ఓటమిని తట్టుకోలేక పోతున్నారు. అందుకే ఏదిపడితే అది మాట్లాడుతున్నారు. తెలంగాణను అప్పులకుప్ప చేసి, దోపిడీకి తెరలేపి, సర్వనాశనం చేసిన వారే ఇవాళ..నోరు పెద్దది చేస్తున్నారు. అప్పులపై ప్రశ్నలకు సమాధానం లేదు. కాళేశ్వరం అవినీతిపైనా సమాధానం లేదు. ధరణి అక్రమాలపై నోరు మెదపరు. ప్రభుత్వ భూముల మాయంపైనా జవాబు చెప్పారు. నాటి ఎమ్మెల్యేలు, మంత్రుల భూ దందాలపైనా నోరువిప్పరు.ఇదంతా ఎందుకంటే ఎక్కడ తమ పునాదులు కదులుతాయోనన్న భయం వారిని వెన్నాడుతోంది. అందుకే ఎదురుదాడి దిగుతున్నారు. ఈ సమాధానాలు పక్కన పెట్టి జీతాలు ఇవ్వడం లేదంటారు. సకాలంలో నీళ్లు రావడం లేదంటారు. అప్పుడే కరెంట్ పోయిందని అంటారు. ఆరు గ్యారెంటీలు ఎలా అమలు చేస్తారని అంటారు. ఇవన్నీ అడిగితే..వీటిపై ఎదురు తదాడి చేస్తే..కాంగ్రెస్ సమాధానం చెప్పలేదని అనుకుంటున్నారు. అందుకే ఓ క్రమపద్ధతిలో గత మూడు నెలలుగా ఎదురుదాడితో బిఆర్ఎస్ ముఖ్యులు ముందుకు సాగుతున్నారు. లోక్‌సభ ఎన్నికలు ముంచు కొస్తున్న సమయంలో తెలంగాణలో బిఆర్ఎస్ ఉనికి కోల్పోవడం ఖాయమని ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్, బిజెపిలకన్నా ఎక్కువగా ఒత్తిడికి గురవుతోంది. భారత రాష్ట్ర సమితి. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన మూడు నెలల్లో మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు ఎదుర్కోవాల్సి రావడం..అవినీతి, అక్రమాల పాపాలు వెన్నాడడంతో పాటు, ప్రజల్లో ప్రాభవం కోల్పోవడంతో తట్టుకోలేక పోతున్నారు. అధికారంలో ఉండగా ప్రజలను ఎందుకు కలవాలన్న వారే ఇప్పుడు నా ప్రజలు అంటూ బయలుదేరారు. ఓ వైపు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.. మరో వైపు పోటీకి సిద్ధంగా లేని పార్టీ నేతలు, బలమైన అభ్యర్థుల్ని ఎంపిక చేసుకోవ డానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడం ..మరితం టెన్షన్‌కు గురి చేస్తున్నాయి. ఈ సమయంలో బలంగా ప్రజల్లోకి వెళ్లడానికి ఓ అజెండా కూడా కరవైంది. దీనికితోడు కాళేశ్వరం పాపాలను నిత్యం ప్రశ్నిస్తున్నారు. మేకపోతు గాంభీర్యం ప్రదర్శించకుంటే బాగుండదని అనుకున్నారో ఏమో...ఇప్పుడు మేడిగడ్డ అంటూ బయలుదేరారు. మొన్నటికి మొన్న మేడిగడ్డకు కాకపోతే బొందలగడ్డకు వెళ్లండని అక్కను వెళ్లగక్కిన కెసిఆర్ ఇప్పుడు అదే మేడిగడ్డకు తన తనయుడి సారథ్యంలో పటాలాన్ని పంపుతున్నారు. ఇదంతా కూడా ఎదురుదాడి పథకంలో భాగం తప్ప మరోటి కాదు. ఇలాచేస్తే ప్రజల్లో ఇమేజ్ పెంచు కోవచ్చు... కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టవచ్చన్న భావన కావచ్చు. తెలంగాణ ఉద్యమంలో కీలకమైన నీళ్ల అజెండాతోనే మళ్లీ వెళ్లాలని.. కాళేశ్వరం విషయంలో తాము చేసిన కృషిని తక్కువ చేస్తున్న ప్రభుత్వ వైఖరిని తప్పు పడుతూ ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించడం కూడా కావచ్చు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే

తెలంగాణ ఉద్యమం నాటి నినాదం మరోమారు తెరపైకి వచ్చింది. ఉద్యమ కాలం నాటి నీళ్లు, నిధులు, నియామకాలు నినాదం ఇప్పుడు మార్మోగుతోం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై దశాబ్దం కావొస్తున్నా ఉద్యమ కాలం నాటి నీళ్లు, నిధులు, నియామకాలు సాకారం కాలేదన్నది జగమెరిగిన సత్యం. ఎందుకంటే కెసిఆర్ పాలనలో కాళేశ్వరం కట్టి నీటి సమస్య తీరిందన్నారు. లక్షా నలభైవేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు.

తెలంగాణ ప్రజలు అంతా ధనవంతులయ్యారని, ఎకరా భూమి ఎక్కడా 30 లక్షలకు తక్కువ లేదని నమ్మ బలికారు. ఇలా ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చామని పదేళ్లుగా ప్రచారంలో ప్రజలను ముంచారు.

కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలపై కాంగ్రెస్ బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేయడంతో పదేళ్ల అధికార మత్తులో ఉన్నవారి కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. దీనిని తప్పించుకునేందుకు నల్లగొండలో ఓ సభ పెట్టి కాంగ్రెస్‌ను విమర్శించే పనిచేపట్టింది. ఇప్పుడు చలో మేడిగడ్డ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. కాళేశ్వరం సమగ్ర స్వరూపాన్ని ప్రజలకు తెలియజెప్పే ప్రయత్నాలు ప్రారంభించింది.పార్లమెంటుకు ఎన్నికలు జరగబోతున్న తరుణంలో బీఆర్ఎస్ పార్టీ కనీసం ఓ రెండు సీట్లయినా గెలవకుంటే ..ఇక ఆ పార్టీ లేచి నిలబడదు. అందుకే ప్రాజెక్టుల సందర్శన పేరిట ప్రజాక్షేత్రంలోకి దిగడంలో రాజకీయం చేస్తోంది. గతంలో అధికారంలో ఉండగా మేడిగడ్డకు ఒక్కరిని కూడా పోకుండా పోలీసులను కాపలా పెట్టింది. బహుశా ఎన్నికలయ్యేంత వరకు ఈ కార్యాచరణ కొనసాగుతుందని అంచనా. కాళేశ్వరంప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ ఎన్నికలకు ముందు కుంగిపోయిన విషయం వెలుగు చూసింది. అప్పటినుంచి రాష్ట్ర రాజకీయాల్లో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ... బీఆర్ఎస్ వైఖరిని ఎండగట్టేందుకు అసెంబ్లీలో సాగునీటి ప్రాజెక్టులపై శ్వేత పత్రం విడుదల చేసింది. 'కాళేశ్వరం ఓ విఫల ప్రాజెక్టుగా ఎత్తిచూపింది. బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని తెలంగాణ ప్రజానీకానికి తెలియచేసింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి.. బ్యారేజీలోని లోపాలను ఎత్తిచూపారు. ఆనాడు రమ్మని బిఆర్ఎస్‌కు ఆహ్వానం పలికినా తిరస్కరించిన వారు ఇప్పుడు అదే మేడిగడ్డకు వెళ్లడం రాజకీయయాత్ర కాక మరోటి కాదు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను ప్రజలు ఆదరిస్తే ఉంటారు..లేకుంటా కాలగర్భంలో కలసిపోతారు. రాజకీయ అవినీతికి పాల్పడే పార్టీలను ప్రజలు ఎప్పటికప్పుడు గుర్తించి వాతు పెడితేనే మరోమారు ఇలాంటి అక్రమాలకు తావుండదని గుర్తించాలి



## వైసీపీని స్టార్ క్యాంపెయినర్ల కొరత వేధిస్తోందా?

ఎన్నికల్లో బలమైన అభ్యర్థుల ఎంపిక ఎంత ముఖ్యమో పార్టీలకు ప్రచారం చేసే నాయకులూ అంతే ముఖ్యం. పార్టీల అభ్యర్థులు, నాయకులు ప్రచారం చేస్తారు. కానీ వీళ్ళు కాకుండా జనాన్ని అట్రాక్ట్ చేసే నాయకులు చాలా అవసరం. వీళ్ళనే స్టార్ కేంపెయినర్లు అంటారు. ప్రతి పార్టీ ఇలాంటివారిని ఎంపిక చేస్తుంది. ఆ జాబితాను ఎన్నికల కమిషన్ కు పంపుతుంది. ఎంతమంది స్టార్ కేంపెయినర్లు ఉండాలనేది ఆయా పార్టీల ఇష్టం. ప్రస్తుతం ఏపీలో ఎన్నికల వేడి రాజుకుంది. అన్ని పార్టీలు యుద్దానికి సిద్ధమంటున్నాయి. టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకున్నాయి. సీట్లు పంచుకున్నాయి. ఈ కూటమిలో బీజేపీ చేరేదీ లేనిదీ ఇంకా క్లారిటీ రాలేదు. మరోపక్క కాంగ్రెస్, వామపక్షాలు కూటమిగా జత కలిశాయి. వైసీపీ ఒంటరిగా పోటీ చేస్తోంది. ఇదీ ప్రస్తుతం ఏపీలో ఉన్న సీన్. ఇప్పుడు జనాల్లో, పొలిటికల్ సర్కిల్స్ లో ఏ పార్టీ స్టార్ కేంపైనర్లు ఎవరు అనే చర్చ జరుగుతోంది. వైసీపీకి బలం సీఎం జగన్మోహనరెడ్డి. ఆయన ఇప్పుడు జనంపైకి ఓ సెంటిమెంట్ అస్త్రాన్ని సంధిస్తున్నారు. మొన్నటి వరకూ తనకు ఛానెల్స్ లేవని.. విపక్షాలకు ఛానెల్స్, పేపర్లు ఉన్నాయని ప్రసంగిస్తూ వచ్చారు. ఇప్పుడు తన పార్టీకి స్టార్ క్యాంపెయినర్లు లేరంటున్నారు సీఎం జగన్. చంద్రబాబుకు దత్తపుత్రుడు పవన్ ఓస్టార్ క్యాంపెయినర్ అని, బీజేపీలో ఉన్న వదిన పురంధేశ్వరి మరో స్టార్ క్యాంపెయినర్ అన్నారు. రాష్టాన్ని చీల్చి, అన్యాయంగా విభజించిన కాంగ్రెస్‌లోనూ చంద్రబాబుకు స్టార్ క్యాంపెయినర్ ఉన్నారంటూ... సోదరి షర్మిలను పరోక్షంగా టార్గెట్ చేశారాయన. పసుపు, కమలాల మనుషులు బాబుకు స్టార్ క్యాంపెయినర్‌లు ఉన్నారు. ఇంకా స్టార్ క్యాంపెయినర్‌లు చాలామందే ఉన్నారు. అమరావతిలో బాబు బినామీలు ఉన్నట్లే.. ఇతర పార్టీల్లో చంద్రబాబు బినామీలు స్టార్ క్యాంపెయినర్‌లు ఉన్నారు. చెడు మాత్రమే చేసిన చరిత్ర ఉన్న చంద్రబాబు నాయుడికి గజ దొంగల ముఠా ఉంది. ఆయనకు మంచి చేసిన ఘనతే లేదు. పాలనతో మోసం చేసిన ఘనతే ఉందని విమర్శించారు. ఏం చేయని ఆయనకు ఇంత మంది స్టార్ క్యాంపెయినర్‌లు ఉన్నారు. బాబును భుజాన మోసే ముఠా చాలా మందే ఉన్నారు. తనకు అలాంటి వారు ఎవరూ లేరన్నారు. తను ప్రవేశపెట్టిన పథకాల వల్ల లబ్ధి పొందిన ప్రజలే తన స్టార్ క్యాంపెయినర్లన్నారు సీఎం జగన్. జగన్ ఇలా అంటున్నప్పటికీ ఆయన పార్టీలోనూ స్టార్ కేంపెయినర్లు ఉన్నారని అంటున్నారు. గత ఎన్నికల్లో వైసీపీకి వైఎస్ షర్మిల, జగన్ మాతృమూర్తి విజయమ్మలు.. స్టార్ క్యాంపెయినర్లుగా ప్రచారం చేశారు. వీరికి తోడు కొన్ని నియోజకవర్గాల్లో మోహన్‌బాబు, అలీ. వంటివారు కూడా.. ప్రచారంలో దూకుడు చూపించారు. ఇక, టీడీపీ విషయానికి వస్తే.. బాలయ్య కొంత వరకు మేనేజ్ చేశారు. సినిమా రంగం నుంచి పెద్దగా ఎవరూ రాకపోయినా.. ప్రదానంగా చంద్రబాబే ప్రచారాన్ని భుజాన వేసుకున్నారు.వైసీపీ ప్రచారాన్ని జగన్.. ఆయన కుటుంబం మోసింది. ఆయన సతీమణి భారతి కూడా.. పులివెందుల సహా కడపలో ఇంటింటి ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ నుంచి టికెట్లు పొందే నాయకులు.. కొందరు.. సమీప నియోజకవర్గాల బాధ్యతల ను కూడా నెత్తిన వేసుకోవాలని ఎ÷-లాన్ చేస్తున్నట్టు సమాచారం. అదే సమయంలో స్టార్ క్యాంపెయినర్లుగా కొందరిని ఎంపిక చేస్తున్నట్టు సమాచారం. మాస్ ఇమేజ్ సహా వాగ్దాటి ఉన్న నాయకుడు..టీడీపీపై విరుచుకుపడే వారు కీలకంగా మారనున్నారు. ఉదాహరణకు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని, నగరి ఎమ్మెల్యే రోజా, మంత్రి గుడివాడ అమర్నాథ్ వంటివారిని తీసుకుంటే.. వీరిలో నాని, రోజా ఇద్దరూ కూడా ÷ర్ (బ్రాండ్స్ పైగా.. రాష్ట్ర వ్యాప్తంగా వారికి మంచి ఫాలోయింగ్ ఉంది. మాస్ నుంచి క్లాస్ వరకు కూడా.. వీరు ఆకట్టుకునే అవకాశం ఉంది.

దీంతో ఇలాంటి వారిని ఎంపిక చేసి స్టార్ క్యాంపెయినర్లుగా ఎంపిక చేయాలని వైసీపీ నిర్ణయించే అవకాశం ఉందని తెలుస్తోంది. వీరు మాత్రమే కాదు.. ÷ర్ ఉన్న నాయకులను ఎంపిక చేయాలని కనీసం 10 -15 మందితో స్టార్ క్యాంపె యిన్ టీంలను ఏర్పాటు చేయాలని చూస్తున్నారు. వీరంతా.. తమ తమని యోజకవర్గాలతో పాటు.. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి పార్టీని గెలిపించాలి.

అదే విధంగా పేర్ని నాని, గుడివాడ అమర్నాథ్ వంటి వారు.. ఆయా సామాజిక వర్గాలు.. జిల్లాలకు పరిమితం చేసి.. బాధ్యతలు అప్పగించే యోచన చేస్తున్నారు. రాష్టాన్ని నాలుగు వైపుల నుంచి కమ్ముకుని ప్రచారం చేయడానికి అవసరమైన స్టార్ క్యాంపెయినర్లు టీడీపీ, జనసేన కూటమికి ఉన్నారు. టీడీపీ నుంచి చీఫ్ చంద్రబాబునాయుడు తో పాటు నారా లోకేష్ కూడా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇక జనసేన వైపు నుంచి క్రౌడ్ పుల్లర్ పవన్ కల్యాణ్ ఎలాగూ ఉంటారు.

మరో వైపు పవన్ కల్యాణ్ కోసం.. జనసేన కోసం.. సినీ తారలు తరలి వస్తారు. ఒక వేళ బీజేపీ కూటమిలోకి వస్తే.. ప్రధానమంత్రి కూడా ప్రచారానికి వస్తారు. ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సీఎం జగన్ ఒక్కరే స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్నారు. గతంలో జగన్ తరపున ప్రచారం చేసేందుకు షర్మిలతో పాటు వైఎస్ విజయమ్మ కూడా ఉండేవారు. ఈ సారి వారు కూడా లేరు. ఈ కారణంగా ప్రచార భారం అంతా తాను ఒక్కరే మోయాల్సి ఉంది. అంతా ఒంటి చేత్తో సీఎం జగన్ చూసుకోవాల్సి ఉంది.

## ఈసారి భానుడి భగభగలు

### ఎండప్రచండం తప్పదంటున్న ఐఎండి



న్యూఢిల్లీ, మార్చ్ 01 (ప్రజామంటలు): ఈ ఏడాది 2024 లో సూర్యుడు తన విశ్వరూపాన్ని చూపించనున్నాడు. చలికాలంలో వెచ్చదనాన్ని పంచాల్సిన భానుడు భగభగలాడిస్తున్నాడు. ఇందుకు సంకేతంగానే మార్చి చివర్లో రావాల్సిన ఎండలు ఫిబ్రవరి మొదట్లోనే వచ్చేశాయి. దీంతో రాబోయే రోజులు ఎలా గడుస్తాయోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో ఐఎండీ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈ వేసవికాలంలో భానుడు తన ప్రతాపాన్నంతా చూపిస్తాడని పేర్కొంది. ఎల్‌నినో పరిస్థితులు బలహీనపడ్డ ప్పటికీ అవి ఇంకా చురుగ్గానే ఉన్నాయని, వాటి ప్రభావం మే వరకు కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో మార్చి నుంచి మే వరకు పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. వాయువ్య ప్రాంతంలోని కొన్ని ప్రాంతాలు మినహా దేశం మొత్తం కఠినమైన వేసవిని ఎదుర్కొనే అవకాశం ఉందని ఐఎండీ వివరించింది. కోస్తా తీర భారతం, ఈశాన్య, పశ్చిమ, మధ్య, వాయువ్య ప్రాంతాలలో మార్చిలో నెలవారీ గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయి. తూర్పు, తూర్పు-మధ్య భారతదేశంలోని చాలా ప్రాంతాలు, వాయువ్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం నుంచి సాధారణం కంటే తక్కువ గరిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉంది. హిమాలయ ప్రాంతాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతల్లో మార్పులు ఉండకపోవచ్చని ఐఎండీ అంచనా వేసింది. దేశంలోని చాలా ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ వేడిగాలులు వీచే అవకాశం ఉంది. బలహీనపడిని ఎల్‌నినో పరిస్థితులు మే వరకు కొనసాగుతాయని అధికారులు భావిస్తున్నారు. ఎల్‌నినో కారణంగా సాధారణం కంటే ఎక్కువ వేడి ఉంటుంది కాబట్టి ఈ ఏడాది సైతం ఎక్కువ ఎండలు ఉండవచ్చని తాము భావిస్తున్నట్లు ఐఎండీ డైరెక్టర్ జనరల్ మోహపాత్ర చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లనుంచి బయటకు రావద్దని, అత్యవసరమై బయటకు వస్తే కనీస జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం

### సీబీఐ కేసులో అప్రూవర్‌గా మారిన మాగుంట రాఘవ



న్యూఢిల్లీ, మార్చ్ 01 (ప్రజామంటలు): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు మాగుంట రాఘవ సీబీఐ కేసులో అప్రూవర్ గా మారారు. ఈడీ కేసులో ఇప్పటికే మాగుంట రాఘవ అప్రూవర్ గా మారగా తాజాగా సీబీఐ కేసులోనూ అప్రూవర్ గా మారడానికి రాఘవ చేసుకున్న దరఖాస్తును తాజాగా రౌస్ అవెన్యూ కోర్టు అనుమతి ఇచ్చింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో కీలకంగా వ్యవహరించిన దినేశ్ అరోరా, శరత్ చంద్రారెడ్డి ఇప్పటికే అప్రూవర్లుగా మారగా తాజాగా మాగుంట రాఘవ సైతం అప్రూవర్ గా మారడంతో ఈ కేసుపై మరింత ఉత్కంఠ పెరుగుతోంది. ఈ కేసులో ఇటీవలే కవితకు సీబీఐ నోటీసులు ఇచ్చింది. ఈ క్రమంలో రాఘవులు అప్రూవర్ గా మారడం సంచలనంగా మారింది. డిల్లీ ఈ కుంభకోణంలో మాగుంట పాత్ర ఉన్నట్లు ఇప్పటికే దాఖలు చేసిన చార్జిషీట్లు, పలువురి రిమాండ్ అప్లికేషన్లలో ఈడీ పేర్కొన్న విషయం తెలిసిందే. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేతలకు రూ.100 కోట్ల మేర సౌత్ గ్రూపు ముడుపులు చెల్లించినట్లు ఈడీ ఆరోపి స్తోంది. ఈ సౌత్ గ్రూపులో మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆయన కుమారుడు రాఘవ్ మాగుంట, కవిత, అరబిందో ఫార్మా సంస్థ డైరెక్టర్ శరత్‌చంద్రారెడ్డి భాగస్వాములుగా ఉన్నారని చెబుతోంది. సమీర్ మహేంద్రుకు చెందిన ఇండోస్పిరిట్స్ కంపెనీలో రాఘవ్‌కు 32.5 శాతం వాటాలు ఉన్నాయని ఈడీ గుర్తించింది. మద్యం విధానం రూపకల్పనలో భాగంగా జరిగిన పలు సమావేశాల్లో మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నట్లు ఆధారాలు సేకరించింది. ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో కూడా సమావేశాలు జరిగాయని, వాటికి అరుణ్ పి÷-లళై, కవిత మాజీ ఆడిటర్ బుచ్చిబాబు హాజరైనట్లు పేర్కొంది. ఆయన నివాసంలో ఈడీ, సీబీఐ సోదాలు కూడా నిర్వహించాయి. ఆయా హోటళ్లలో జరిగిన సమావేశాలు, రూపకల్పనలో భాగస్వామ్యం, సౌత్ గ్రూపు వ్యవహారాలు, ఇతర నిందితులతో సంబంధాలు, ముడుపుల చెల్లింపు, నగదు లావాదేవీలపై ఈడీ ప్రశ్నించింది. గతంలో చాలా కాలం పాటు ఈడీ కేసులో జైల్లో ఉన్నారు మాగుంట రాఘవ్ రెడ్డి. మాగుంట శ్రీనివాసులరెడ్డికి వైఎస్ జగన్ టిక్కెట్ నిరాకరించడం.. పార్టీ వ్యవహారాల్లో పట్టించుకోకపోవడంతో ఆయన ఇటీవల వైసీపీకి రాజీనామా చేశారు. టీడీపీలో చేరే అవకాశం ఉంది. మాగుంట రాఘవరెడ్డి ఈ సారి ఎంపీ ఎన్నికల్లో పోటీ చేస్తారని ఆయన చెబుతున్నారు. అయితే ఇంత వరకూ చంద్రబాబునాయుడ్ని కలవలేదు. గతంలో కాంగ్రెస్ లో ఉండేవారు.. తర్వాత టీడీపీలో చేరారు. ఓ సారి టీడీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు . తర్వాత వైసీపీలో చేరి ఎంపీ అయ్యారు. మాగుంట కుటుంబం చాలా కాలం రాజకీయాల్లో ఉన్నా.. వారిపై ఎప్పుడూ స్కాం ఆరోపణలు రాలేదు. కానీ ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు మాత్రం మెడకు చుట్టుకుంది. మాగుంట కుటుంబానికి పెద్ద ఎత్తున మద్యం కంపెనీలు ఉన్నాయి.

## కాపుల చీలిక అనివార్యమా!

### వైసీపికి మరోసారి అధికారం తథ్యమా!

టీడీపీతో పొత్తు జనసేనలో చిచ్చు పెట్టింది. ఈ పొత్తుతో తమకు అవమానం జరిగిందని జనసేన శ్రేణులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇక రాష్ట్రంలోని కాపుల గురించి చెప్పనవసరం లేదు. తమను టీడీపీ వద్ద దేహీ అనే పరిస్థితికి తీసుకువచ్చారని కాపులు పవన్ కల్యాణ్ పై మండిపడుతున్నారు. అయితే వీటిని పవన్ కల్యాణ్ అస్సలు పట్టించుకోవట్లేదని తాజా సభలో తన మాటల ద్వారా స్పష్టం చేశారు. వాస్తవానికి టీడీపీతో పొత్తు తప్పదని పవన్ ఎప్పుడో చెప్పేశారు. అలాగే కాపు సామాజిక వర్గం తనకు అండగా నిలవలేదని కూడా చాలా సార్లు బహిరంగంగానే తన అసంతృప్తి వ్యక్తం చేశారు. కాబట్టి ఇంత జరిగినా కాపు సామాజిక వర్గం నుంచి పవన్ కు పూర్తి మద్దతు లభిస్తుందా అనేది ప్రశ్న. గతంలో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు తమ కులం వాడు సీఎం అవుతాడని కాపులంతా కలిశారు. దీంతో టీడీపీ, కాంగ్రెస్ రెండూ నష్టపోయాయి. కానీ ఈసారి కాపుల పరిస్థితి అలా లేదు. పవన్ చంద్రబాబుకు జై కొట్టడంతో కొత్త దారులు వెతుక్కుంటున్నారు. జనసేన కార్యకర్తలు కూడా డైలామాలో పడ్డారు. 2019 ఎన్నికల సమయంలో చంద్రబాబు, లోకేష్ అవినీతిపరులని పవన్ కల్యాణ్ చెప్పిన మాటలను గుర్తు చేసుకుంటున్నారు. బాలకృష్ణ జనసేన కార్యకర్తల గురించి చేసిన అనుచిత వ్యాఖ్యలను గుర్తు చేసుకుంటున్నారు. రెండు జెండాలను మోసేందుకు సిద్ధంగా తాము లేమని తమ దారులు తాము వెతుక్కుంటున్నట్లు సమాచారం. నాడు లోకేష్ పై పవన్ కల్యాణ్ విరుచుకుపడ్డప్పుడు టీడీపీ వారితో సోషల్ మీడియా వేదికగా ఒక యుద్ధమే చేశామని పవన్ అభిమానులు చెబుతున్నారు. మరి నాడు లోకేష్, చంద్రబాబులను అవినీతిపరులుగా ముద్రవేసిన పవన్ కల్యాణ్ నేడు ఏ రకంగా వారిని సమర్థిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. మొత్తానికి పవన్ టీడీపీ పొత్తుతో కాపులు మరోసారి ఆలోచనలో పడ్డారని అంటున్నారు. దానికి తగ్గట్లుగానే పొత్తులో, సీట్ల పంపకంలో జనసేనకు, పవన్‌కు తీవ్ర అవమానం జరిగిందని ఫీలవుతున్నారు. ఇక మళ్లీ కాపులు చీలిపోతే మాత్రం వైసీపీ మరోసారి ఆ ఓటు బ్యాంకుతో అధికారంలోకి రావడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక కాపుల్లో ఇప్పటికీ బలమైన నాయకులుగా ఉన్న ముద్రగడ పద్మనాభం, చేగొండి హరిరామ జోగయ్య పట్ల పవన్ వ్యవహార శైలి కూడా కాపుల కోపానికి కారణమవుతోంది. ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ఇప్పటికీ వారే ఆ సామాజిక వర్గానికి పెద్ద దిక్కు అని చెప్పక తప్పదకు. వారి స్థానాన్ని భర్తీ చేయాలని పవన్ అనుకుంటే..వ్యవహరించాల్సిన తీరు ఇదు కాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పవన్ తీరు మారకుంటే కాపుల్లో చీలిక అనివార్యం ....అది వైసీపికి మరోసారి అధికారం కట్టబెట్టమూ తథ్యం!

## ఎయిర్‌ఫోర్స్ విమానంలో సాంకేతిక లోపం

### రెండుగంటలపాటు ఆకాశంలో చక్కర్లు

హైదరాబాద్, మార్చ్ 01 (ప్రజామంటలు): నగరంలో షాకింగ్ పరిణామం చోటుచేసుకుంది. టెక్నికల్ సమస్య తలెత్తడంతో ఓ విమానం ల్యాండింగ్ సంక్లిష్టంగా మారింది. అయితే దాదాపు అరగంట ఉత్కంఠ తర్వాత విమానం సేఫ్‌గా ల్యాండ్ అయ్యింది. బేగంపేట విమానాశ్రయం పరిసరాల్లో దాదాపు అరగంటపాటు చక్కర్లు కొట్టిన తర్వాత సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానానికి ఈ పరిస్థితి ఎదురైంది. విమానం పైలెట్లు ఎమర్జెన్సీ ల్యాండింగ్ కోసం విశ్వప్రయత్నాలు చేసి చివరికి విజయవంత మయ్యారు. కాగా ల్యాండింగ్ కోసం ప్రయత్నిస్తుండగా ట్రైల్‌లో ఈ సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో ఫ్లైట్ ల్యాండింగ్ విషయంలో కొద్దిసేపు ఉత్కంఠ కొనసాగుతోంది.



# ప్రశాంత వాతావరణంలో కట్టుదిట్టంగా పబ్లిక్ పరీక్షల నిర్వహణ

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, శాంతి కుమారి
- పరీక్షా కేంద్రాలలో సెల్ ఫోన్ లు అనుమతించవద్దు
- ప్రతి ఎంపిడిఓ, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు
- ఇంటర్, 10వ తరగతి పరీక్షల నిర్వహణ
- ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటుపై జిల్లా కలెక్టర్ లతో సీఎస్ సమీక్ష



**జగిత్యాల మార్చ్ 01 (ప్రజామంటలు):** ప్రశాంత వాతావరణంలో కట్టుదిట్టంగా పబ్లిక్ పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి , డీజిపి, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి ఇంటర్, 10వ తరగతి పరీక్షల నిర్వహణ, ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటుపై జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయని, మార్చి 19 వరకు ఇంటర్ పరీక్షలు, మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు 10వ తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, దీనికోసం పకడ్బందీ ఏర్పాట్లు చేసి ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. ఇంటర్, 10వ తరగతి పరీక్ష కేంద్రాల లోపలికి ఎవరు సెల్ ఫోన్ తీసుకుని వెళ్లడానికి వీలులేదని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కట్టుదిట్టంగా సజావుగా పరీక్షలు నిర్వహించాలని సీఎస్ తెలిపారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునే విధంగా అవసరమైన రూట్లలో బస్సు సర్వీసులు నడపాలని, కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎక్కడ చిన్న పొరపాటు కూడా జరగకుండా సజావుగా పరీక్ష నిర్వహించాలని సీఎస్ సూచించారు. ప్రతి ఒక్క అర్హుడికి ప్రభుత్వ గ్యారెంటీ పథకాలు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రతి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో, అదే విధంగా మున్సిపాలిటీలో అవసరమైన మేర ప్రజా పాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని సిఎస్ తెలిపారు. ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటు కోసం అవసరమైన మేర డాటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించాలని, ప్రతి ప్రజా పాలన సేవా కేంద్రంలో అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్ తదితర సామాగ్రి సిద్ధం చేసుకోవాలని సిఎస్ అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ, పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనయ్యే విద్యార్థులు చదివింది గుర్తుండడం లేదనుకుని విద్యార్థులు 14416 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి మానసిక వైద్యుల సలహాలను తీసుకోవాలని, మనో ధైర్యాన్ని పంచుకోవాలని అన్నారు. ప్రశ్న పత్రం కఠినంగా ఉందని సరైన సమాధానాలు వ్రాయలేదు అని నిరాశ పడవద్దని కలెక్టర్ తెలిపారు. తల్లి దండ్రులు కూడా తమ పిల్లలకు పరీక్షల సమయంలో ధైర్యాన్ని కలిగించాలని, నిరాశ పడకుండా భరోసా కల్పించి పరీక్ష కేంద్రాలకు పంపాలని అన్నారు. పరీక్షా కేంద్రాలకు ఎవరు సెల్ ఫోన్ తీసుకొని రావద్దని, ఈ అంశాన్ని మరోసారి స్పష్టం చేస్తూ ప్రతి పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్, 10వ తరగతి పరీక్షలు జిల్లాలో సమర్థవంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరగవద్దని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి నారాయణ, జడ్పీ సీఈఓ గౌతం రెడ్డి, డిప్యూటీ సీఈఒ రఘువరన్, మునిసిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ కమిటీల పునర్నిర్మాణం కోసం మండల శాఖ సన్నాహక సమావేశం

### అంబేద్కర్ ఆశయ సాధనకు అందరు కృషి చేయాలి



**భీమదేవరపల్లి మార్చ్ 01 (ప్రజామంటలు):** తెలంగాణ అంబేద్కర్ సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో గ్రామ కమిటీల నిర్మాణం కోసం భీమదేవరపల్లి మండలంలో అన్ని గ్రామాల్లో పునర్నిర్మాణం కోసం మండల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 5 నుండి 28 వరకు ప్రతి గ్రామంలో కమిటీలు వేస్తామని సంఘ నాయకులు తెలిపారు. శుక్రవారం ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద సభ్యత్వ నమోదు బుక్స్, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందం, జిల్లా ఉపాధ్యక్షులు కుమార్, మండల కన్వీనర్లు బొల్లంపల్లి రాజు, ఏల్పూరి ప్రేమ్, కో. కన్వీనర్స్ కొమ్ముల రవీందర్ గడిపే అరుణ్ కుమార్, సిద్ధమల్ల వెంకటేష్, దాట్ల రాజు, దళిత నాయకులు మాట్ల వెంకటస్వామి, తాడూరి చిరంజీవి, మాడుగుల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కండువా కప్పుకున్న సింగిల్ విండో చైర్మన్



**ఇబ్రహీంపట్నం మార్చ్ 01 (ప్రజామంటలు):** ఇబ్రహీంపట్నం మండలం పరిధిలోని తిమ్మాపూర్ గ్రామం లో తిమ్మాపూర్ సింగిల్ విండో చైర్మన్ భాష శ్రావణ్ ను కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీ లోకి ఆహ్వానించిన మన గౌరవనీయులు కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావు. ఇబ్రహీంపట్నం మండలం అధ్యక్షుడు గూడ శ్రీకాంత్, ఎంపీటీసీ పొనుకంటి చిన్న వెంకటి, మండల కాంగ్రెస్ కార్యకర్తలు, మరియు మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షునిగా సత్యనారాయణ



**కోరుట్ల మార్చ్ 01 (ప్రజామంటలు)** ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షునిగా కోరుట్ల పట్టణానికి చెందిన లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ కరస్పాండెంట్ తుమ్మనా పెల్లి సత్యనారాయణ ఎన్నికయ్యారు. గురువారం నాడు జరిగిన రాష్ట్ర స్థాయి ట్రస్మా ఎన్నికలలో ఏకగ్రీవంగా ఆయన ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఎన్నిక పట్ల సహకరించిన కరస్పాండెంట్ మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలుపుచున్నానని నాపై నమ్మకంతో నన్ను రాష్ట్ర స్థాయి లో నిలబెట్టినందుకు సంఘ అభివృద్ధికి నా శాయ శక్తులా కృషి చేస్తానని అన్నారు. సన్మాన కార్యక్రమం లో ప్రిన్సిపాల్ సిరికొండ గంగాధర్, తుమ్మనపల్లి మనోజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గృహ అవసరాల సిలిండర్లు వినియోగిస్తున్న వాణిజ్య సంస్థలపై కేసులు నమోదు



**జగిత్యాల మార్చ్ 01 (ప్రజామంటలు):** జిల్లా కలెక్టర్, జగిత్యాల ఆదేశముల మేరకు మార్చ్ 01 న జిల్లాలో పలు ప్రాంతాలలో డొమెస్టిక్ సిలిండర్ల ఉపయోగిస్తున్న వాణిజ్య సంస్థలు, హెూటల్ లపై తనిఖీలు నిర్వహించి (21) కేసులు నమోదు చేయడం జరిగింది. పౌరసరఫరా నాయబ్ తహశీల్దార్, జగిత్యాల, మల్యాల అండ్ మెట్ పల్లి మరియు పౌరసరఫరా ఇన్స్పెక్టర్, జగిత్యాల, మల్యాల అండ్ మెట్ పల్లి గార్లు జగిత్యాల జిల్లా లోని పలు ప్రాంతాలలోని హెూటల్ లలో తనిఖీలు నిర్వహించి (36) డొమెస్టిక్ సిలిండర్లను గుర్తించి (21) వ్యక్తులపై కేసులు నమోదు చేసి సిలిండర్లను స్వాదిస పరచుకొని సంబందిత గ్యాస్ ఏజెన్సీలకు భద్రతా నిమిత్తం అప్పగించనైనది. అదేవిధముగా సబ్సిడీ సిలిండర్లు ను దుర్వినియోగం చేసే వారిపై చట్ట పరమైన చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాల అధికారి, జగిత్యాల పేర్కొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ ద్వారానే అంబేద్కర్ ఆశయం సఫలీకృతం



**మహాదేవపూర్ మార్చ్ 01 (ప్రజామంటలు):** మహాదేవపూర్ మండల కేంద్రంలో నియోజక వర్గ సమీక్షా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఎం.ఆర్.పి.యస్. మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ మాదిగ అధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా కాల్వల శరత్ మాదిగ జిల్లా అధ్యక్షులు బట్టు విజయ్ మాదిగ హాజరు కావడం జరిగింది. కాల్వల శరత్ మాదిగ మాట్లాడుతూ.... ఏడు దశాబ్దాలుగా దేశాన్ని పాలించిన పాలకులు ఎస్సీల మధ్య అంతర్గతంగా పెరిగిన అసమానతలను తొలగించే ప్రయత్నం చేయకపోవడం దారుణమని అన్నారు. రిజర్వేషన్లు దోచుకునే వర్గాలకే వత్తాసు పలికారు. కానీ ఎస్సీలలో వెనుకబడిన కులాల వైపు కన్నెత్తి కూడా చూడలేదని అన్నారు మంద కృష్ణ మాదిగ దండోరా ఉద్యమం స్థాపించిన తరువాతనే మాదిగ ఉప కులాల ప్రజలకు జరిగిన అన్యాయం వెలుగులోకి వచ్చిందని అన్నారు మొదటి దశలో పెద్ద ఎత్తున పోరాటం చేసి వర్గీకరణ ను సాధించుకుంటే కొంత మంది స్వార్థపరులు సుప్రీం కోర్టు కెక్కి రద్దు చేయించారని అన్నారు ఎస్సీ వర్గీకరణ న్యాయమైనదని దర్మమైందని సమాజం యావత్తు అంగీకరించిందని కనుక ధర్మం గెలవాలంటే ఎస్సీ వర్గీకరణ జరగాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు పోరాటం ఆగదని అన్నారు. భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు బట్టు విజయ్ మాదిగ మాట్లాడుతూ.... ప్రస్తుతం ఉద్యమాన్ని పునర్నిర్మాణం చేస్తున్నామని ఈ నిర్మాణంలో పెద్ద ఎత్తున మాదిగ ఉప కులాల ప్రజలు పెద్ద ఎత్తున పార్లమెంట్ స్థాయి సమావేశానికి మందకృష్ణ మాదిగ ఈ నెల 8 తేదీన గోదావరిఖని వస్తున్న క్రమంలో ఈ ఐదు మండలాల ప్రజలు అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యకర్తల సమావేశంలో పెద్దపల్లి ఎంఎస్ టి జిల్లా ఇన్చార్జి మంథని చందు పెద్దపల్లి ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పొట్ల రమేష్ మహదేవపూర్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ మాదిగ మల్హాల్ రావు మండల అధ్యక్షులు కే సారపు నరేష్ మాదిగ, మహ ముత్తారం మండల అధ్యక్షుడు పులి ఎలా రాజయ్య మాదిగ, కాటారం మండల అధ్యక్షులు మంతెన చిరంజీవి, మాదిగ పలిమెల మండల ఇన్చార్జి పత్తి మల్లేష్ సీనియర్ నాయకులు నల్ల బుగ ధర్మయ్య, మండల అధికార ప్రతినిధి మంథని రవితేజ, ఎమ్మార్పీఎస్ నాయకులు చింతకుంట్ల సదానందం, చింతకుంట్ల రాము, తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ కి ఓటు అడిగే అర్హత లేదు

### సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి



**ఎల్కతుర్తి మార్చ్ 01 (ప్రజామంటలు):** కరీంనగర్ ఎంపి బండి సంజయ్ ఎంపీగా గెలిచి ఏ ఒక్క రోజు కూడా గ్రామాల, మండలాల పర్యటన చేయకుండా ప్రజల సమస్యలు పరిష్కరించని ఆయనకు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు అడిగే అర్హత లేదని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. శుక్రవారం ఎల్కతుర్తిలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ బండి సంజయ్ కరీంనగర్ కు చేసిన అభివృద్ధి ఏమీ లేదని అన్నారు. అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వాటిని పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యంనకు చెందారన్నారు. సెంటిమెంట్ డైలాగ్స్ తో..దేవుని పేరుతో ప్రజలను ఎల్లకాలం బండి సంజయ్ మోసం చేయలేరని అన్నారు. హైదరాబాద్ తర్వాత పెద్ద నగరం అయిన వరంగల్ మహానగరం కు ఆనుకొని ఉన్న ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్ మండలాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. ఎంపీ బండి సంజయ్ కేంద్రంతో మాట్లాడి పరిశ్రమలు తీసుకురావడంలో పూర్తిగా వైఫల్యం చెందారని అన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను జాతీయం చేసి ప్రజల సంక్షేమ కోసం కృషి చేస్తే వాటిని నేటి ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం గుజరాత్ వ్యాపారులకు ఈ దేశ సంపదని దోచిపెడుతూ లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను రోజురోజుకు దిగదారుస్తూ, వ్యవసాయ రంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నా కూడా మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతాంగాన్ని ఇబ్బంది పెడితే, గత సంవత్సర క్రితం వేలాది మంది రైతులు ఢిల్లీ నగరంలో సంవత్సరం పాటు నిరసన కార్యక్రమం కొనసాగిన కూడా నల్ల చట్టాలను తొలగించలేదన్నారు. స్వామినాథన్ కమిషన్ నివేదిక అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడటకు కృషి చేయాలని, విద్యా వైద్యం వ్యాపారంగా మారిపోయిందని చదివిన నిరుద్యోగులకు ఉపాధి కల్పించుటకు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న దేవాదుల ప్రాజెక్టు అసంపూర్తిగా నిర్మాణం ఉన్న కాలువలను పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు రైతాంగానికి నీరు అందించాలని, పేదలకు ఇళ్ల స్థలాల ఇచ్చి, ప్రభుత్వం త్వరితగతిన ఇండ్లు కట్టించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరు రాములు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, నాయకులు శనిగరపు రాజ్ కుమార్, నిమ్మల మనోహర్, తండ ముండయ్య, గడ్డం రాజనర్సు, అంబాల పట్న స్వామి, బాడిషా ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



## బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, కోట రాజబాబు జన్మదిన వేడుకలు

**మహాదేవపూర్ మార్చ్ 01 (ప్రజామంటలు):** బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాబు జన్మదినం పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శంకరయ్య అధ్వర్యంలో కోట రాజబాబు 61వ జన్మదిన వేడుకలు మహాదేవపూర్ లోని స్వర్గీయ శ్రీపాద రావు విగ్రహం దగ్గర జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి అకుతోట సుధాకర్, ఎస్ సి సెల్ మండల అద్యక్షులు లేతకారి రాజబాబు, యూత్ నాయకులు నవీన్, కుదురుపల్లి మాజీ సర్పంచ్ కోట సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వామన్ రావు, రామారావు కృష్ణమూర్తి యూత్ టౌన్ అధ్యక్షులు నయీమ్, యూత్ నాయకులు హరీష్ కృష్ణ మోహన్, సుంకరి సమ్మయ్య, శ్రీను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




## డిగ్రీ కాలేజీ యాజమాన్య నూతన కార్యవర్గం ఎన్నిక

**జగిత్యాల మార్చ్ 01 (ప్రజామంటలు):** తెలంగాణ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ మేనేజ్మెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం హైదరాబాదులో ఏర్పాటయింది. అధ్యక్షుడిగా బొజ్జ సూర్యనారాయణ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు గా శ్రీధర్ రావు,పరమేష్ ఉపాధ్యక్షులుగా నారాయణ గౌడ్, రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శిగా యాద రామకృష్ణ, కోశాధికారిగా శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భాస్కర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పూర్వ అధ్యక్షులు ప్రకాష్, గింజల రమణారెడ్డి, సుందర్ రాజ్, కార్యదర్శులు హరిస్మరణ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి ఆర్కే, ఎన్ ఎస్ వి విద్యాసంస్థల చైర్మన్ యాద రామకృష్ణకు సుప్మా అధ్యక్షులు మాదారపు వెంకటేశ్వర్లు, ప్ర కార్యదర్శి శ్రీపాద నరేష్,, కోశాధికారి శేఖర్ లు అభినందనలు తెలియజేశారు.

## పోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఒగ్గు కథ

### భక్తులను ఆకట్టుకున్న కళాకారులు

### రాత్రి అంతా కథను వీక్షించిన భక్తులు



**బుగ్గారం మార్చ్ 01 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా బుగ్గారంలోని శ్రీ ముత్యాల పోచమ్మ-నల్ల పోచమ్మ ఆలయాల కమిటీ అధ్వర్యంలో జాతర ఉత్సవాల సందర్భంగా గురువారం రాత్రి ఆలయ ప్రాంగణంలో ఒగ్గు కథ కార్యక్రమం నిర్వహించారు. ఒగ్గు కళాకారులు తమదైన శైలిలో కళా ప్రదర్శన నిర్వహించి భక్తులను ఎంతగానో ఆకట్టుకు న్నారు. గొల్లపల్లి మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన శ్రీ మల్లిఖార్జున స్వామి ఒగ్గు కళా బృందం నిర్వహించిన ఈ ఒగ్గు కథ రాత్రి 8-30 గంటలకు ప్రారంభమై శుక్రవారం తెల్లవారే దాకా కొనసాగింది. కళా బృందం నిర్వాహకులు దీకొండ బాపన్న, దీకొండ కుమార స్వామి, దీకొండ రాము, వీరు కుమార్, కచ్చు మల్లేశం, వీరు రవి, సాయిల్ల రాకేష్ తదితరులు పలు వేశధారణలతో ఒగ్గు కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారుడు బాపన్న మాట్లాడుతూ.... ప్రాచీన కలలు అంతరించిపోతున్న నేటి తరుణంలో కూడా ఒగ్గు కలను గుర్తించి ఈ కళా ప్రదర్శన నిర్వహింప జేసిన బుగ్గారం పోచమ్మ ఆలయాల కమిటీ కి, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఒగ్గు కథ వీక్షించడానికి రాత్రి పూట కూడా స్వచ్ఛందంగా తరలి వచ్చిన భక్తులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కళా నైపుణ్య మాటలతో ఆకట్టుకొన్నారు. ముత్యాల పోచమ్మ - నల్ల పోచమ్మ ఆలయాల ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయాల కమిటీ చైర్మన్ మసర్తి నర్సయ్య, కమిటీ కార్యవర్గం, గ్రామ ప్రముఖులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సఖి సెంటర్ కోఆర్డినేటర్ లక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై అవగాహన

**సైదాపూర్ మార్చ్ 01 (ప్రజామంటలు):** సైదాపూర్ మండలంలోని పెర్కపల్లి గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో “స్నేహిత” కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సఖి సెంటర్ కోఆర్డినేటర్ లక్ష్మీ హాజరైనారు. ముఖ్య అతిథి లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినులు లైంగిక వేధింపులను ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థినులకు “గుడ్ టచ్”, “బ్యాడ్ టచ్” గురించి వివరించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మాట్లాడుతూ.... మత్తు పదార్థాలు, డ్రగ్స్, సేవించడం వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. మత్తు పదార్థాలు సేవించేవారు వాటి నుండి ఎలా ఉపశమనం పొందాలో వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ.... విద్యార్థులు ఉన్నత ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలి అన్నారు. చదువు వల్లనే విద్యార్థులకు విజ్ఞానం కలుగుతుందనితెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు అందరికీ స్ఫూర్తిగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో సఖి సెంటర్ కోఆర్డినేటర్ లక్ష్మి, ప్రాథమికఆరోగ్య కేంద్రం డాక్టర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయుల బృందం, పెరిక పల్లి కార్యదర్శి అంగన్వాడి సూపర్వైజర్ స్వరూప, పెరిక పల్లి, గొల్లగూడెం, అంగన్ వాడి టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



# కేటీఆర్ దమ్ముంటే కరీంనగర్ నుండి పోటీ చేయు

- సీఎం పదవి, ఎమ్మెల్యే ఒక్కటేనా అని కేటీఆర్ పై ఫైర్
- కేటీఆర్ అడబిడ్డలను గౌరవించడం నేర్చుకో
- ఇండ్ల నిర్మాణంపై వారంలో నిబంధనల ప్రకటన
- రెండు నెలల్లో కొత్త రేషన్ కార్డుల జారీ
- ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



**జగిత్యాల మార్చ్ 01 (ప్రజామంటలు):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాజినామ చేసి మల్కాజిగిరి నుండి ఎంపీగా పోటీచేయాలని కేటీఆర్ సవాలు చేయడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే, సీఎం పదవి ఒక్కటేనా అని మాజీమంత్రి, కాంగ్రెసు సీనియర్ నేత, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి కేటీఆర్ పై ఫైర్ అయ్యారు. కేటీఆర్ సవాలు విసరడం పై నక్కకు నాగలోకానికి ఉన్నంత వ్యత్యాసం ఉందని జీవన్ రెడ్డి మండిపడ్డారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గం కరీంనగర్ పరిధిలోఉంది కదా, దమ్ముంటే కరీంనగర్ లేదా, నిజామాబాద్ నుండి ఎంపీగా పోటీచేయాలని కేటీఆర్ కు సవాల్ విసిరారు.జగిత్యాల లోని ఇందిరా భవన్ లో శుక్రవారం జీవన్ రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వాస్తవాలు తెలుసుకో, కేటీఆర్ మాట్లాడే తీరుతో బీఆర్ ఎస్ గెలుస్తుందన్న ఒక్క మెదక్ ఎంపీ సీటుకుడా గెలిచే అవకాశం ఉండదన్నారు. రెండు టీఎంసీ లు ఉపయోగించకుండా మరో అదనపు టీఎంసీ కోసం అనుమతులు లేకుండా చేపట్టడం నేరమని అన్నారు. తుమ్మడి హెట్టీ వద్ద 160 టీఎంసీ ల నీరు లభ్యత ఉందని నివేదిక ఉండగా తుమ్మడి హేట్టి నుండి కిందికి దించటానికి మరో నివేదిక సైతం ఇచ్చారని చెప్పారు. 148 మీటర్ల ఎత్తు బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకుందని, ఒక్క లిఫ్ట్ తో ఎల్లంపల్లి కి నీరు చేరేదని కేంద్ర జలవనరుల శాఖ నిపుణులు

వేదిర శ్రీరామ్ నివేదిక ఇచ్చారని చెబుతూ మేడిగడ్డ పిల్లర్లు కుంగడం టెక్నికల్ లోపమని పేర్కొంటున్నారని తెలిపారు. ఇకనైనా జ్ఞానోదయం చేసుకోమ్మని కేటీఆర్ కు సూచించారు.

గత ఏడాది ఫిబ్రవరిలో విద్యుత్ వినియోగం కన్నా ప్రజలు ఈ ఏడాది అధికంగా వినియోగించారని తెలిపారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇకనైనా కేటీఆర్ స్థాయికి తగిన విధంగా మాట్లాడాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హితవు పలికారు. అనంతరం పోచంపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ లో చేరగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.

సమావేశంలో నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, గాజంగి నందయ్య, గాజుల రాజెందర్, మన్సూర్ అలీ, కొత్త మోహన్, గుండా మధు, జున్ను రాజేందర్, బొల్లి శేఖర్, మ్యాన మహేష్, భీరం రాజేష్, గంగాధర్ పాల్గొన్నారు.

# వంగరలో క్షుద్ర పూజల కలకలం

**మేకను కోసి బలి**

**మూఢనమ్మకాలను నమ్మొద్దు**

**ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు**



**భీమదేవరపల్లి మార్చ్ 01 (ప్రజామంటలు):** మండలంలోని వంగర గ్రామంలో మాలపల్లి వెళ్ళు దారిలో కల్వర్టు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహించి నట్లుగా ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. చెట్ల ప్రక్కన ఒక మేక పిల్లను కోసి, రోడ్డు పక్కన పడవేసినారు. క్షుద్ర పూజలు చేసిన ప్రదేశంలో చీరే, జాకెట్, లంగా, బనియన్స్ పడవేసినారు. మంత్ర తంత్రాల కలకలంతో స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా వంగర ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మూఢనమ్మకాలకు గురి చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నది ఎవరైనా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తానే స్వయంగా క్షుద్ర పూజల ప్రదేశంలో ఉన్న వస్తువులను, కోసిన మేకను తొలగించారు. ఏమి కాదు మూఢనమ్మకాలు మాత్రమే అని నిరూపించారు.

## స్మగ్లర్ల దాటికి రేపా తుమ్మ చెట్లు మాయం?

**నిద్ర మత్తులో అధికారులు**

**వేలేరు మార్చ్ 01 (ప్రజామంటలు):** వేలేరు మండలంలోని గ్రామాలలో కొంతమంది ఏజెంట్లను పెట్టుకొని స్మగ్లర్ల దాటికి రేపా తుమ్మ చెట్లు మాయం గ్రామస్తు లు ఎన్నిసార్లు అధికారులకు సమాచారం ఇచ్చిన చోద్యం చూస్తున్న అధికారులు.జిల్లా అధికారులు పట్టించుకోని పెరిగే చెట్లను కాపాడాలని పలు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# మీసేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ప్రకటన



**జగిత్యాల మార్చ్ 01 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లాలో నూతనంగా మీ-సేవ కేంద్రాల ఏర్పాటుకు అర్హులైన ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపిన కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా. జిల్లాలోని 14 మండలాల పరిధిలో 20 కొత్త మీ-సేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. భీమారం మండలం వెంకట్రావ్ పేట, బుగ్గారం మండలం గోపులాపూర్ , ధర్మపురి మండలం రాయపట్నం, జైన, ఎండపల్లీ మండలం గుల్లకోట, గొల్లపల్లి మండలం తిర్మలాపురం (యం), ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి, ఎర్దండి, జగిత్యాల గ్రామీణ మండలం అంతర్గాం, కథలాపూర్ మండలం ఇప్పపల్లి, కొడిమ్యాల మండలం నమిలికొండ, కోరుట్ల మండలం వెంకటాపూర్ ఎక్స్ రోడ్, అంబేద్కర్ నగర్ (కోరుట్ల), మల్లాపూర్ మండలం రేగుంట, మొగిలిపేట, రాఘవపేట్, మేడిపెల్లి మండలం వల్లంపల్లి, మెట్ పెల్లి మండలం చౌలమద్ది, మెట్ల చిట్టపూర్ , పెగడపెల్లి మండలం మద్దులపల్లి %ఇ% రోడ్ లలో ఒకొక్కటి చొప్పున మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు మార్చి 7 వ తేదిలోగా సంబంధిత తహసిల్దారు కార్యాలయాలలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. జిల్లా అధికారిక వెబ్ సైట్ %ష్ట్రజాం://ఞఞఞ.యిస్త్రఞుశ్రీ.వశ్రీఞఅస్త్రుఞు.ప్త్రశీజ.ఱఅ% నుండి దరఖాస్తు ఫారాలను డౌన్ లోడ్ చేసుకొని దరఖాస్తులకు సమర్పించాలని సూచించారు. దరఖాస్తు దారుడు నిరుద్యోగి అయి ఉండాలని, దరఖాస్తు ఫారంతో పాటు 500 రూపాయలు విలువ డిమాండ్ డ్రాఫ్ట్ ను జిల్లా కలెక్టర్ జగిత్యాల పేరున తీసుకొని దరఖాస్తు ఫారానికి జత చేయాలని తెలిపారు. అభ్యర్థి ఏదైనా గ్రాడ్యుయేట్ లేదా అంతకంటే ఎక్కువ విధ్యర్హతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని తెలిపారు. దరఖాస్తు ధారుణి యొక్క విద్యార్హత, కంప్యూటర్ ట్రెయినింగ్ సర్టిఫికేట్ కలిగి ఉండాలని తెలిపారు. దరఖాస్తు దారుడు అవసరమైన మౌళిక సదుపాయాలను పెట్టుబడి పెట్టడానికి తగిన స్తోమత కలిగి ఉండాలని, 18-35 సంత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థి జగిత్యాల జిల్లాలోని అదే మండలానికి, గ్రామ పంచాయతి లేదా సమీప గ్రామ పంచాయతీకి చెందిన వాడై ఉండాలి. మీ సేవ కేంద్రామునకు ఎంపిక చేయబడిన అభ్యర్థి, వారి మండలములో నిర్దేశించబడిన ప్రదేశములో మాత్రమే కేంద్రమును ఏర్పాటు సమయములో ఎస్ఎస్ సి నుండి గ్రాడ్యుయేట్ వరకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, నివాస ధ్రువీకరణ పత్రం,కుల ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తుకు అనుబంధముగా సమర్పించబడిన ఆధార పత్రాలు అన్నింటి పైన గెజిటెడ్ ధ్రువీకరణ చేయించి జత పరచాలని తెలిపారు. తనిఖీలో అనుమతించబడిన అభ్యర్థులకు మాత్రమే తదుపరి పరీక్షకు అర్హత ఇవ్వబడును అని వివరించారు. పరీక్షా విధానంలో ఐ టీ (70 మార్కులు) నైపుణ్యాలను అంచనా వేయడానికి వ్రాత పరీక్షా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వ్రాత పరీక్షా ప్రాథమిక కంప్యూటర్ నాలెడ్జ్, తెలంగాణ స్టేట్ మీ సేవా సర్వీసెస్ ( అబీజేక్టీవ్ టైప్) పై ఉంటుందని తెలిపారు. అభ్యర్థికి ( 30 మార్కుల)తో ఇంటర్వ్యూ కూడా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు.

## మాదిగ అమరవీరులకు ఘన నివాళులు

**భీమదేవరపల్లి మార్చ్ 01 (ప్రజామంటలు):** మండలములోని ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకుల ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణలో అమరులైన మృత వీరులకు ఘనంగా నివాళులర్పించారు. మండల ఇంచార్జి నాగిళ్ళ చందర్ ఆధ్వర్యంలో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ మాట్ల వెంకటస్వామి మాదిగ హాజరైనారు. ఆయన మాట్లాడుతూ, షెడ్యూల్ కులాల వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పడిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఎన్నో అలుపెరుగని పోరాటాలు చేసిందని అన్నారు. ప్రాణాలకు సైతం లెక్కచేయని ఎందరో సోదరుల త్యాగ ఫలితమే నేటి వర్గీకరణ అని అన్నారు. మాదిగ ఉపకులాలైన బుడగ జంగ కులమునకు జిల్లా కేంద్రంలో కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చేవారు. మందకృష్ణ మాదిగ పోరాటం వల్ల నేడు మండలంలో కుల సర్టిఫికెట్ తీసుకుంటున్నారని అన్నారు. అంతేకాకుండా పెన్షన్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రేషన్ బియ్యం పెంపు, ఇలా ఎన్నో సామాజిక వర్గాలకు ఎమ్మార్పీఎస్ అండగా ఉందన్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో షెడ్యూల్ వర్గీకరణ గురించి వాదోపవాదాలు జరుగుతున్నాయి. న్యాయమే అంతిమంగా గెలుస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్నందుల సురేష్, కనకరాజ్, కుమార్, మిట్టపల్లి రమేష్, మాడుగుల ప్రతాప్, వంగ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.



# అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థల నుండి దరఖాస్తుల ఆహ్వానం

**జగిత్యాల మార్చ్ 01 (ప్రజామంటలు):** మహిళా శిశు వికలాంగుల మరియు వయోవృద్ధుల శాఖ జగిత్యాల జిల్లాలో సఖి కేంద్రం /వన్ స్టాప్ సెంటర్ సేవలను అమలు పరచుటకు ఇంప్లెమెంటింగ్ ఏజెన్సీ (స్వచ్ఛంద సంస్థ) గా పనిచేయుటకు అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థల నుండి దరఖాస్తులు కోరడమైనది. అర్హత నియమావళి, దరఖాస్తు నమూనా మరియు ఇతర సమాచారం కొసం Website: https://jagtial.telangana.gov.in ను సందర్శించి అప్లికేషను డౌన్లోడ్ చేసుకోగలరు. పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు అవసరమగు డాక్యుమెంట్లను అటెస్టేషన్ చేసి జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం. మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల శాఖ, జగిత్యాల, జిల్లా కార్యాలయాల సముదాయం (%IDOC), Room No% 07, జగిత్యాల జిల్లా pincode:505327 వద్ద దాఖలు చేయాలి. దరఖాస్తుల స్వీకరణ తేదీ: 02.03.2024 10.30 AM నుండి తేదీ: 07.03.2024 సాయంత్రం 5:00 PM వరకు అందించవలెను. పోస్టల్ యొక్క ఏదైనా జాప్యం ఆలస్యం కాబడిన దరఖాస్తులు పరిశీలింపబడవు. సంప్రదించుటకు మొబైల్ నెంబర్: 9000013624 Mail ID: dwojagtial@gmail.com. మరియు తేది:11.03.2024 రోజున అర్హత పొందిన సంస్థల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ నిర్వహించబడును. తుది ఫలితములు తేది: 12.03.2024 రోజున ప్రకటించబడుతాయి.

## 42 వ వార్డులోని కబ్రస్తాన్, ఈద్గా మరమ్మతులు పరిశీలించిన ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్ పర్సన్



**జగిత్యాల మార్చ్ 01 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణంలోని 42వ వార్డు కబరస్తాన్, ఈద్గా లో మరమ్మత్తుల పనులను పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ అడ్వాల జ్యోతి లక్ష్మణ్, మాజీ మున్సిపల్ చేర్మెన్ గిరి నాగభూషణం, విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చేర్మెన్ మన్సూర్ బాయ్ పరిశీలించారు. మాజీ కౌన్సిలర్ పిప్పరి అనిత శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు నేహల్ బాయ్, ముస్లిం మైనారిటీ కమిటీ సదర్ బారి బాయ్, మాజీ కౌన్సిలర్స్ మైనార్టీ నాయకులు మీర్ ఖాజీమ్ అలీ, మహిమూద్ అలీ, మైనార్టీ నాయకులు వివిధ హెూదాలో ఉన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను కలిసిన జగిత్యాల అర్బన్, రూరల్ మండలం

**ఆర్ఎంపి మరియు పి.ఎం.పి. వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు**



**జగిత్యాల మార్చ్ 01 (ప్రజామంటలు):** ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని కలిసిన జగిత్యాల అర్బన్ రూరల్ మండలం ఆర్ఎంపి మరియు పి.ఎం.పి. వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అభినందించి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. ఆర్ఎంపి పిఎంపి సంఘం భవనానికి 10 గుంటల స్థలం కేటాయించడం జరిగింది అని, అర్ఎంపి, పిఎంపి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బుధరపు జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షులు కొండబత్తిని గణేష్, సెక్రటరీ కోల మహేందర్, ట్రెజరర్ శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ గోపి, కార్యవర్గ సభ్యులు మోహన్, బి.రాజేష్, రాజారాం, ఎండి అబ్దుల్లా, భూమరాజం, టి. గంగాధర్,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లోకమాత పోచమ్మ తల్లిని దర్శించుకున్న ఆర్డీవో నర్సింహమూర్తి దంపతులు



**జగిత్యాల మార్చ్ 01 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రంలోని పురాణీపేట శ్రీ లోకమాత పోచమ్మ తల్లినీ శుక్రవారం ఆర్డిఓ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల ఆర్డీవో నర్సింహ మూర్తి దంపతులు శ్రీ లోకమాత పోచమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి మహా ఆశీర్వాదాన్ని అందజేశారు. అలాగే ఆలయ కమిటీ సభ్యులు ఆర్డీవో దంపతు లను శాలువాతో సత్కరించి లోకమాత పోచమ్మ తల్లి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు గాజుల రాజేందర్, రేపల్లె హరికృష్ణ, రాజగోపాల చారి, జనగామ గంగారం, ములస్తం మల్లికార్జున్, అంగడి మఠం చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పాన్-రక్షణ దుస్తుల (పి.పి.ఈ.) పై అవగాహన



**భీమదేవరపల్లి మార్చ్ 01 (ప్రజామంటలు):** రైతులు తమ వ్యవసాయ క్షేత్రంలో క్రిమిసంహారక మందులు పిచికారి చేసినప్పుడు రక్షణ దుస్తులు (పిపిఈ) ధరించాలని బీసీఐ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొత్తకొండ గ్రామంలో రైతులకు డబ్ల్యూ.డబ్ల్యూ.ఎఫ్ - నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ బి.సి.ఐ. ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు క్షేత్ర ప్రదర్శన చేసి, పురుగుల ఉధృతి ఎక్కువ ఉంటే ఆ పురుగుకు సంబంధించిన ఒకే మందును మాత్రమే స్ప్రే చేయాలని అన్నారు. రెండు లేదా అంతకన్నా ఎక్కువ రకాల పురుగు మందులు కలిపి (కాక్టైల్) స్ప్రే చేయరాదని అన్నారు. కాబట్టి ప్రతి రైతు రక్షణ దుస్తులు అనగా ముఖానికి మాస్క్, తలకి హెల్మెట్, శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు, కండ్లకి అద్దాలు, చేతులకు గ్లౌజులు, కాళ్ళకి బూట్లు వేసుకొని స్ప్రే చేయాలని కోరారు. బాల కార్మికులను పనిలోకి తీసుకోరాదని, రైతు కూలీలకు కనీస వేతన చట్టం ప్రకారం డబ్బులు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.

## కొమ్మూరి ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి ఎల్ఓసి



**జనగామ మార్చ్ 01 (ప్రజామంటలు):** జనగామ పట్టణ కేంద్రానికి చెందిన నూక విమల చిన్న ప్రేగు కాన్సర్ తో అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం స్థానిక నాయకులు ద్వారా కొమ్మూరి ప్రతాప్ రెడ్డి దృష్టికి తీసుకురాగా హైదరాబాద్లోని నిమ్స్ హాస్పిటల్లో గుండె ఆపరేషన్ కోసం రూ. 2లక్షల10వేల ఎల్వోసి మంజూరు చేయించారు. హైదరాబాద్లోని కొమ్మూరి నివాసంలో శుక్రవారం రూ. 2 లక్షల 10వేల ఎల్ఓసి కాపీని బాధితుని సోదరుడు నూక అమర్ నాథ్ కు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. నిరుపేదలమైన మాకు గుండె ఆపరేషన్ కోసం 2 లక్షల 10 వేల ఎల్ఓసి మంజూరు చేశారని కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మేలు మర్చిపోలేమని, జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు తెలియజేశారు.

## కాలేశ్వరం ముక్తేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, జెడ్పి చైర్ పర్సన్



**మహదేవ్ పూర్ మార్చ్ 01 (ప్రజామంటలు):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్ పూర్ మండలం కాళేశ్వరంలో కోలువున్న కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకొని గర్భాలయంలో స్వామివారికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్, జగిత్యాల జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి. అనంతరం ఆలయ అర్చకులు శేష వస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే లు, నాయకులు, ఇంజనీర్ లతో కలిసి ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ మేడిగడ్డ ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ అవారి శివకేసరి బాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రావు, నాయకులు సమిండ్ల శ్రీనివాస్, మహేందర్ తదితరులు ఉన్నారు.

# పుష్ప-2 గురించి రోజుకో సంచలన వార్త

## సమంత తరహాలో జాన్వీ ఎంట్రీ సాంగ్



పుష్ప-2 గురించి రోజుకోవార్త సంచలనం కలిగిస్తోంది. ఇప్పుడీ సినిమా విడుదల కోసం అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో మరోవార్త సంచలనంగా మారింది. అతిలోక సుందరి తనయ జాన్వీ కపూర్ 'పుష్ప-2'లో మెరవనుందని అంటున్నారు. బన్నీతో ఆడిపాడి అలరించనుందా అంటే అవుననే అంటున్నాయి సినీ వర్గాలు. అధికారిక ప్రకటన రాలేదు కానీ ప్రస్తుతం టాలీవుడ్‌లో ఈ వార్త విపరీతంగా వైరల్ అవుతోంది. 'పుష్ప' సినిమాలో 'ఊ అంటావా మావా...' అంటూ పాట ఎంత ఊపు ఊపిందో తెలిసిందే. అందులో సమంత చేసిన అందాల సందడి అంతా ఇంతా కాదు. 'పుష్ప 2'లో కూడా ఆ తరహాలోనే ఓ ప్రత్యేక గీతం ఉంటుందని మొదటి నుంచి టాక్ నడుస్తోంది. ఇప్పటిదాకా పలువురి బాలీవుడ్ తారల పేర్లు వినిపించాయి. తాజాగా జాన్వీ కపూర్ పేరు బలంగా వినిపిస్తోంది. పుష్పరాజ్ పక్కన జాన్వీ కాలు కదపడానికి రెడీ అవుతోందని తెలుస్తోంది. మరి ఈ ప్రత్యేక గీతంలో ఆడి పాడడానికి సై అన్నారా? లేదా అన్న విషయంపై ఇంకా ఎలాంటి స్పష్టత లేదు. ఇప్పటికే జాన్వీ తెలుగులో రెండు ప్రాజెక్టలతో బిజీగా ఉంది. ఎన్టీఆర్ 'దేవర' చిత్రంతోపాటు రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రంలో కూడా జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోన్న సంగతి తెలిసిందే! చరణ్ సినిమా వేసవిలో ప్రారంభం కానుంది. 'పుష్ప 2'లో ప్రత్యేక గీతానికి జాన్వీ 'ఊ' అంటే టాలీవుడ్ స్టార్స్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, అల్లు అర్జున్‌లతో కలిసి నటించిన కథానాయిక అవుతుంది జాన్వీ.

## వైమానిక దళ ఆపరేషన్ ఆధారంగా

# ఆపరేషన్ వాలెంటైన్






తెలుగులో ఎయిర్ ఫోర్స్ యుద్ధం నేపథ్యంలో సినిమాలు ఎప్పుడూ రాలేదు. ఇప్పుడు వరుణ్ తేజ్ ఈ యుద్ధ నేపథ్యంలో 'ఆపరేషన్ వాలెంటైన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకి వచ్చాడు. శక్తి ప్రతాప్ సింగ్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమాతో వరుణ్ తేజ్ హిందీలో అరంగేట్రం చేస్తున్నాడు. మానుషి చిల్లర్ ఇందులో కథానాయక. ఈ సినిమాలో హిందీ తెలుగు నటులు మిశ్రమంగా కనిపిస్తారు. అర్జున్ రుద్ర దేవ్ అలియాస్ రుద్ర భారత వైమానిక దళంలో స్క్వాడ్రన్ లీడర్, యుద్ధ పైలట్ కూడా. ధైర్య సాహసాలకు పెట్టింది పేరు, దానివలన అప్పుడప్పుడు పై అధికారులతో చివాట్లు కూడా తింటూ ఉంటాడు. అతని ప్రియురాలు అహన (మానుషి చిల్లర్) రాడార్ ఆపరేటర్ గా వైమానిక దళంలోనే పనిచేస్తూ ఉంటుంది. అర్జున్ ప్రాజెక్ట్ వజ్ర సరిగా పని చేస్తోందో లేదో అని టెస్ట్ చేసే సమయంలో అతని మిత్రుడు (నవదీప్) ని కోల్పోతాడు. ఆ తరువాత పాకిస్తాన్ కి చెందిన టెర్రరిస్టులు భారత సైనికులను తీసుకు వెళుతున్న ట్రక్కులపై దాడి చేస్తారు, ఇందులో 40 మంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోతారు. దీనికి ప్రతిగా భారత వైమానిక దళం ఒక ఆపరేషన్ ప్లాన్ చేస్తుంది. ఏంటి ఆ ఆపరేషన్, అది ఎలా అమలు చేస్తారు, వజ్ర ప్రాజెక్ట్ నేపథ్యం ఏంటివన్నీ 'ఆపరేషన్ వాలెంటైన్' సినిమాగా మలిచారు. ఈ కథ నిజ సంఘటనల ఆధారంగా తీసిన కథ. పాకిస్తాన్ టెర్రరిస్టులు జమ్మూ కాశ్మీర్ లోని పుల్వామా దాడిలో 40 మంది భారత సైనికులను పొట్టను పెట్టుకున్న ఉదంతం అందరికీ తెలిసినదే. దానికి ప్రతిగా భారత వైమానిక దళం పాకిస్థాన్లోని టెర్రరిస్ట్ క్యాంపులను విచ్ఛిన్నం చేసిన సంగతి కూడా తెలిసిందే. ఈ 'ఆపరేషన్ వాలెంటైన్' అనే సినిమా ఈ కథ ఆ సంఘటన ఆధారంగా తీసుకున్నదే. అయితే తెలుగులో ఇలాంటి యుద్ధ నేపథ్యం ఉన్న సినిమా రావటం ఇదే మొదటిసారి. ఇలాంటి సినిమాలు చేయాలంటే చాలా కంప్యూటర్ గ్రాఫిక్స్ అవసరం, ప్రేక్షకులకి నమ్మించే విధంగా కూడా ఉండాలి, అలాంటి సన్నివేశాలు కూడా చూపించగలగాలి. ఇవన్నీ కాకుండా దేశభక్తి అనే భావోద్వేగంతో పాటు మనుషుల మధ్య కూడా ఆ భావోద్వేగాలు కనిపించాలి. అప్పుడే ఈ తరహా సినిమాలు విజయం సాధిస్తాయి. ఇక ఈ ఆపరేషన్ వాలెంటైన్ సినిమాకు వస్తే దర్శకుడు శక్తి ప్రతాప్ సింగ్ తన పరిధి మేరకు చేసాడు అని చెప్పొచ్చు, అక్కడక్కడ చిన్న చిన్న లోటుపాట్లు వున్నా తెలుగు సినిమాలో ఇటువంటి కథా నేపథ్యం ఉన్న సినిమా తీయడం హర్షించదగ్గ విషయమే. ఇంతకుముందు హృతిక్ రోషన్, దీపికా పదుకొనే జంటగా నటించిన 'ఫైటర్' సినిమా కూడా ఇటువంటి కథా నేపథ్యం ఉన్న సినిమా అవడం ఆసక్తికరం. ఇప్పుడు ఈ 'ఆపరేషన్ వాలెంటైన్' సినిమా కూడా అదే నేపద్యంలో వచ్చింది. ఇందులో దేశభక్తి కనిపిస్తుంది కానీ సినిమాలో భావోద్వేగాలు అంతగా కనిపించవు, కొన్ని దగ్గర్ల మరీ గ్రాఫిక్స్ అని అర్థం అయిపోతుంది. ఇది వ్యాపారాత్మకంగా నడుస్తుందా నడవదా అన్న విషయాన్ని పక్కన పెడితే వరుణ్ తేజ్ లాంటి నటుడు ఇలాంటి సినిమాతో ముందుకు రావడం హర్షణీయం.

# కలియుగం పట్టణంలో.. కొత్త తరం మూవీ





నాని మూవీ వర్క్స్, రామా క్రియేషన్స్ ఆధ్వర్యంలో విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ హీరోహీరోయిన్లుగా 'కలియుగం పట్టణంలో' అనే ఓ డిఫరెంట్ మూవీ రాబోతోంది. కందుల గ్రూప్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ మూవీకి కథ, డైలాగ్స్ ,స్క్రీన్ ప్లే, దర్శకత్వం ఇలా అన్ని బాధ్యతలను రమాకాంత్ రెడ్డి చూసుకుంటున్నారు. రమాకాంత్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేష్‌లు కలిసి సంయుక్తంగా ఈ మూవీని నిర్మిస్తున్నారు. మార్చి 22న రాబోతోన్న ఈ మూవీలో చిత్రా శుక్లా ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. ఇక ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌ను గురువారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. 'ఆ నలుగురు సినిమాలో అప్పడాలు అమ్మి పెట్టడంలో నా గురువుగా ఆరేళ్ల వయసులోనే విశ్వ కార్తికేయ నాతో పాటు నటించాడని.. ఇప్పుడు హీరోగా నటించాడన్నారు. కొత్త పాయింట్‌తో ఈ చిత్రం రాబోతోందని అర్థం అవుతోందని.. కలియుగం పట్టణంలో అనే టైటిలే చాలా వినూత్నంగా ఉందన్నారు. మార్చి 22న ఈ చిత్రం రాబోతోందని.. ఈ సినిమాను పెద్ద సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

డైరెక్టర్ త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ.. 'కలియుగం పట్టణంలో టీజర్ నాకు చూపించారు. నాకు చాలా నచ్చింది. ఏదో చిన్న సినిమాలా అనుకున్నా.. కానీ హై స్టాండర్డ్‌లా అనిపించింది. విశ్వ కార్తికేయ, ఆయుషి జంట చక్కగా ఉంది. ఈ చిత్రం పెద్ద హిట్ ఇవ్వాలి. దర్శక నిర్మాతలకు మంచి పేరు రావాలి.' అని అన్నారు. డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'మా కలియుగం పట్టణంలో సినిమాను ఆశీర్వదించడానికి వచ్చిన మీడియాకు థాంక్స్. నా సినిమా టీంకు థాంక్స్. మిగతా విషయాలన్నీ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడతాను' అని అన్నారు.




# ఓటిటిలోకి వస్తోన్న హనుమాన్




టాలీవుడ్ స్టార్ దర్శకుడు ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన రీసెంట్ బ్లాక్ బస్టర్ హనుమాన్ మహా శివరాత్రి కానుకగా మార్చి 08 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని చిత్రయూనిట్ ఎక్స్‌లో ప్రకటించింది.. తేజ సజ్జా కథా నాయకుడిగా నటించిన ఈ సినిమా జనవరి 12న ప్రేక్షకుల ముందుకొచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పటివరకు ఈ చిత్రం రూ.300 కోట్లకు పైగా వసూళ్ళను రాబట్టింది. ఇదిలావుంటే ఈ మూవీ ఎప్పుడు ఓటీటీలోకి వస్తుందా ఎప్పుడెప్పుడు చూద్దామా అంటూ ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే వారికి గుడ్ న్యూస్ చెప్పారు మేకర్స్. హనుమాన్ మూవీ తాజాగా ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5 వేదికగా ఈ చిత్రం ఈ సినిమా కథ విషయానికి వస్తే.. అది అంజనాద్రి అనే ఊహ ప్రాంతం. ఆ వూర్లో హనుమంతు (తేజాసజ్జా) ఒక మామూలు కుర్రాడు. చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ సరదాగా కాలం గడిపేస్తుంటాడు. అనుకోని సంఘటనతో హనుమంతుకి కొన్ని అతీత శక్తులు వస్తాయి. ఆ శక్తుల గురించి తెలుసుకున్న మైఖెల్ (వినయ్‌రాయ్) అంజనాద్రి వస్తాడు. హనుమంతు వద్ద శక్తులని తన వశం చేసుకొని ప్రపంచంలోనే అత్యంత శక్తివంతుడు కావాలనుకుంటాడు. మరా ఆ శక్తిని వశం చేసుకోవడానికి మైఖెల్ ఏం చేశాడు? మైఖేల్ వలన అంజనాద్రికి ఎలాంటి ముప్పు వాటిల్లింది ? హనుమంతు మైఖేల్ ని ఎలా అడ్డురుకున్నాడు ? అనేది తెరపై చూడాలి.మరోవైపు ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జై హనుమాన్' రానున్నట్లు ప్రశాంత్ వర్మ ప్రకటించిన విషయం తెలిసిందే. 'హనుమాన్'కు సీక్వెల్‌గా వస్తున్న 'జై హనుమాన్ కు సంబంధించి ఇప్పటికే స్క్రిప్ట్ కూడా సిద్ధమయిపోయిందని ప్రశాంత్ వర్మ వెల్లడించాడు.



# టోక్యోలో రష్మికకు అపూర్వ స్వాగతం

క్రంచీరోల్ అనిమీ అవార్డ్స్'లో భారత్ తరపున పాల్గొనేందుకు స్టార్ హీరోయిన్ రష్మిక మందన్నా జపాన్ రాజధాని టోక్యోకి వెళ్లింది . శనివారం టోక్యోలో ఈ అవార్డ్స్ వేడుక జరగనుంది. గ్లోబల్ ఈవెంట్‌గా జరుగుతున్న ఈ అవార్డ్స్ కార్యక్రమంలో భారతదేశం తరపున రష్మిక రిప్రెజెంట్ చేస్తోంది. ఈ గౌరవం దక్కిన ఏకైక నటిగా రష్మికా మందన్నా రికార్డ్ క్రియేట్ చేసింది. అయితే టోక్యో ఎయిర్ పోర్ట్‌లో ఆమెకు జపాన్ ఫ్యాన్స్ సర్‌ప్రైజింగ్ వెల్కమ్ చెప్పారు. రష్మిక ఫొటోస్‌తో డిజైన్ చేసిన ప్లకార్డులు చూపిస్తూ ఆమెను ఆహ్వానించారు. ఎయిర్ పోర్ట్‌లో అభిమానులు ఇచ్చిన వెల్కమ్‌తో రష్మిక ఆశ్చర్యపోయింది. సర్‌ప్రైజ్ అవుతూ వారికి హాయ్ చెప్పింది. 'పుష్ప, డియర్ కామ్రేడ్' వంటి సినిమాలతో నేషనల్ క్రష్‌గా మాత్రమే కాదు.. గ్లోబల్‌గా రష్మిక అభిమానులను సంపాదించుకుంది. జపాన్‌లోనూ ఆమెకు ఫ్యాన్స్ ఉన్నారు. వారు తనపై చూపిస్తున్న ప్రేమకు పొంగిపోతూ.. రష్మిక తన సంతోషాన్ని వ్యక్తం చేసింది. ప్రస్తుతం రష్మిక మందన్నా 'పుష్ప 2', 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాలతో పాటు ఓ హిందీ ప్రాజెక్ట్‌లోనూ నటిస్తోంది.






# విజయ్ దేవరకొండ ఫ్యామిలీ స్టార్




రౌడీ హీరో విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. గీతగోవిందం సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన పరశురాం ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మృణాళ్ ఠాకూర్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుంది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తుండగా.. ఎస్‌వీసీ బ్యానర్‌లో వస్తున్న 54వ చిత్రమిది. ఈ సినిమా ఏప్రిల్ 05న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఇక విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో చిత్రయూనిట్ ప్రమోషన్స్ షూరు చేసింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి గ్లింప్స్‌తో పాటు ఫస్ట్ సింగిల్ విడుదల చేయగా మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి టీజర్ అప్‌డేట్ ఇచ్చాడు విజయ్ దేవరకొండ. త్వరలోనే టీజర్ రానుంది అంటూ ఎక్స్‌లో రాసుకోచ్చాడు. ఇక ఈ సినిమాలో కుటుంబ బాగోగులు చూసుకునే ఫ్యామిలీ మ్యాన్‌గా, బయట రౌడీల బెండు తీసే పవర్‌ఫుల్ మ్యాన్‌గా విజయ్ దేవకొండ ఇందులో కనిపించనున్నారు. కూల్ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను అలరించనున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ కేయూ మోహనన్, సంగీతం: గోపీ సుందర్. విజయ్ దేవరకొండ మరోవైపు జెర్సీ ఫేం గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో కూడా నటించనున్నాడు పోలీస్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్-శ్రీకర స్టూడియోస్ బ్యానర్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోండగా.. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు.

# కోహ్లీ తర్వాత రోహిత్‌ను కెప్టెన్ చేసింది అందుకే ..




ఇంగ్లండ్‌తో జరుగుతున్నఐదు మ్యాచ్ ల టెస్టు సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే కైవసం చేసుకుంది టీమిండియా. అలాగే, స్వదేశంలో అజేయంగా కొనసాగుతోన్న భారత్ జట్టుకు ఇది 17వ టెస్టు సిరీస్ విజయం.దీంతో స్వదేశంలో అత్యధిక టెస్టు సిరీస్‌లు గెలిచిన జట్ల జాబితాలో టీమ్‌ఇండియా ఇప్పుడు 2వ స్థానంలో నిలిచింది. ఇదిలా ఉంటే.. టీమిండియాను విజయపథంలో నడిపించిన కెప్టెన్ రోహిత్ శర్మపై భారత జట్టు మాజీ కెప్టెన్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అదే సమయంలో కోహ్లి తర్వాత రోహిత్‌కి కెప్టెన్సీ ఎందుకు ఇచ్చారో గంగూలీ వెల్లడించాడు. వాస్తవానికి, 2021లో విరాట్ కోహ్లీ కెప్టెన్సీ నుంచి వైదొలిగిన తర్వాత అప్పటి బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ కెప్టెన్సీని రోహిత్ శర్మకు అప్పగించాలని నిర్ణయించుకున్నాడు. అయితే మొదట్లో బోర్డు నిర్ణయం రోహిత్‌కు నచ్చలేదు. అయితే రోహిత్‌ను ఒప్పించడంలో గంగూలీ సక్సెస్ అయ్యాడు. ఆ తర్వాత రోహిత్ టీమ్ ఇండియా కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. ఈ విషయాన్ని గతంలో గంగూలీనే స్వయంగా చెప్పాడు. చారిత్రాత్మక టెస్టు సిరీస్ గెలిచిన తర్వాత రోహిత్‌ని కెప్టెన్‌గా ఎందుకు ఎంపిక చేశారో మరోసారి వెల్లడించాడు గంగూలీ. 'రోహిత్ శర్మలోని ప్రతిభను చూసి అతనిని కెప్టెన్‌గా ఎంపిక చేశాను. ప్రపంచకప్‌లో అతను జట్టును నడిపించిన తీరు అద్భుతం. అతని నాయకత్వంలో జట్టు ఫైనల్స్‌కు చేరుకుంది. ఫైనల్‌లో ఓడిపోయినా వరల్డ్‌కప్‌లో భారత్ అత్యుత్తమ జట్టుగా భావిస్తున్నాను. రోహిత్ నిజంగా గొప్ప కెప్టెన్. కెప్టెన్‌గా కూడా ఎన్నో ఐపీఎల్ ట్రోఫీలు గెలుచుకున్నాడు. ఇప్పుడు ఇంగ్లండ్ పై సిరీస్ విజయం నన్నేమీ ఆశ్చర్యపర్చలేదు' అని గంగూలీ చెప్పుకొచ్చాడు. ఇక ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్‌లను సెంట్రల్ కాంట్రాక్ట్ నుండి తొలగించడంపై గంగూలీ స్పందించాడు. '%దీజజ×% సెంట్రల్ కాంట్రాక్ట్ పరిధిలో ఉన్న ప్రతి ఆటగాడు ఫస్ట్-క్లాస్ క్రికెట్ ఆడాలి. ఇది భారతదేశంలో క్రికెట్ ప్రాథమిక నిర్మాణం. రంజీల్లో ఇషాన్, శ్రేయస్ అయ్యర్ ఆడకపోవడం నన్ను ఆశ్చర్యపరిచింది. ఇది ఒక ముఖ్యమైన టోర్నమెంట్. అందరూ ఇందులో ఆడాలి. ఈ విషయంలో బీసీసీఐ సరైన నిర్ణయం తీసుకుంది'అని గంగూలీ తెలిపాడు.



# ఇంగ్లండ్‌తో ఐదో టెస్ట్ ఆడే భారత తుది జట్టు ప్రకటన

ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే కైవసం చేసుకున్న టీమిండియా.. చివరి పోరుకు సిద్ధమైంది. మార్చి 7 నుంచి ధర్మశాల వేదికగా జరగనున్న ఈ ఆఖరి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ సిరీస్‌ను ఓటమితో ప్రారంభించిన టీమిండియా.. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో గెలిచి 3-1తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఇదే జోరులో ఆఖరి మ్యాచ్‌ను కూడా గెలిచి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ 2023-25 పాయింట్స్ టేబుల్‌లో తమ స్థానాన్ని మరింత మెరుగుపరుచుకోవాలను కుంటోంది. మరోవైపు ఆఖరి మ్యాచ్‌లోనైనా విజయం సాధించి గెలుపుతో భారత పర్యటనను ముగించాలని ఇంగ్లండ్ భావిస్తోంది. దాంతో ఆఖరి మ్యాచ్ కూడా రసవత్తరంగా సాగనుంది.చివరి మ్యాచ్‌కు కూడా కేఎల్ రాహుల్ అందుబాటులోకి రాకపోవడం.. గత మ్యాచ్‌కు దూరంగా ఉన్న జస్‌ప్రీత్ బుమ్రా రీఎంట్రీ ఇవ్వడంతో టీమిండియా కాంబినేషన్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మరోవైపు తీరిక లేని క్రికెట్ ఆడుతున్న రోహిత్ శర్మకు రెస్ట్ ఇస్తారనే చర్చ నడుస్తోంది. ఒకవేళ రోహిత్ శర్మకు రెస్ట్ ఇస్తే.. వైస్ కెప్టెన్ హెూదాలో జస్‌ప్రీత్ బుమ్రా జట్టును నడిపించనున్నాడు.

హిత్ శర్మ స్థానంలో దేవదత్ పడిక్కల్ అరంగేట్రం చేయనున్నాడు. అప్పుడు రజత్ పటీదార్ కూడా తుది జట్టులో కొనసాగ నున్నాడు. రోహిత్ శర్మ బరిలోకి దిగితే మాత్రం రజత్ పటీదార్ స్థానంలో దేవదత్ పడిక్కల్ అరంగేట్రం చేసే అవకాశం ఉంది. మిగతా బ్యాటింగ్ ఆర్డర్‌లో పెద్దగా మార్పులు చేసే అవకాశం లేదు. ఈ సిరీస్‌లోనే అరంగేట్రం చేసిన సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ సైతం తుది జట్టులో కొనసాగనున్నారు. స్పిన్ ఆల్‌రౌండర్లుగా జడేజా, అశ్విన్ ఆడనుండగా.. భారత్ ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. ధర్మశాల పిచ్ పేస్‌కు అనుకూలంగా ఉంటుంది. జస్‌ప్రీత్ బుమ్రా సారథ్యంలో సిరాజ్, ఆకాశ్ దీప్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. అయితే ఆకాశ్ దీప్‌కు ముకేశ్ కుమార్ నుంచి పోటీ ఎదురుకానుంది. ఎక్స్‌ట్రా స్పిన్నర్‌ను ఆడిస్తే కుల్దీప్ యాదవ్ జట్టులోకి వస్తాడు. రవీంద్ర జడేజాకు రెస్ట్ ఇవ్వాలని భావిస్తే అక్షర్ పటేల్‌కు అవకాశం దక్కుతుంది.

**భారత తుది జట్టు(అంచనా)**

రోహిత్ శర్మ(కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, దేవదత్ పడిక్కల్, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్(కీపర్), సర్ఫరాజ్ ఖాన్, రవిచంద్రన్ అశ్విన్, జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్/ముఖేశ్ కుమార్

టీమిండియా: రోహిత్ శర్మ (కెప్టెన్), జస్‌ప్రీత్ బుమ్రా (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, రజత్ పటిదార్, సర్ఫరాజ్ ఖాన్, ధృవ్ జురెల్ , కేఎస్ భరత్ , దేవదత్ పడిక్కల్, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, ముకేశ్ కుమార్, ఆకాశ్ దీప్.

# చరిత్ర సృష్టించిన ఆస్ట్రేలియా క్రికెటర్!



ఆస్ట్రేలియా వెటరన్ స్పిన్నర్ నాథన్ లయన్ చరిత్ర సృష్టించాడు. టెస్ట్‌ల్లో అత్యధిక వికెట్లు తీసిన ఏడో బౌలర్‌గా నిలిచాడు. న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు తీయడం ద్వారా నాథన్ లయన్ ఈ ఫీట్ సాధించాడు. ఓవరాల్‌గా 128 టెస్ట్‌ల తన కెరీర్‌లో 521 వికెట్లు సాధించాడు. ఈ క్రమంలో వెస్టిండీస్ దిగ్గజ పేసర్ కోర్ట్‌నీ వాల్ష్(519) రికార్డును అధిగమించాడు. న్యూజిలాండ్ బ్యాటర్ స్కాట్ కుగ్గెల్‌జిన్(0)ను ఔట్ చేయడం ద్వారా 520వ వికెట్ మైలు రాయిని అందుకున్న లయన్.. వాల్ష్‌ను వెనక్కినెట్టాడు. టెస్ట్‌ల్లో అత్యధిక వికెట్ల జాబితాలో శ్రీలంక స్పిన్ దిగ్గజం ముత్తయ్య మురళీధరన్(800) అగ్రస్థానంలో ఉండగా.. ఆసీస్ స్పిన్ దిగ్గజం, దివంగత క్రికెటర్ షేన్ వార్న్(708), జేమ్స్ అండర్సన్(698), అనిల్ కుంబ్లే(619), స్టువర్ట్ బ్రాడ్(604), గ్లేన్ మెక్‌గ్రాత్(563) నాథన్ లయన్ కన్నా ముందున్నారు. రవిచంద్రన్ అశ్విన్(507) 9వ స్థానంలో కొనసాగుతున్నాడు. ఈ మ్యాచ్‌లో నాథన్ లయన్(4/43) ధాటికి న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 43.1 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌటైంది. గ్లేన్ ఫిలిప్స్(70 బంతుల్లో 13 ఫోర్లతో 71) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. మ్యాన్ హెన్రీ(34 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 42) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. న్యూజిలాండ్ బ్యాటర్లలో కేన్ విలియమ్సన్(0), రచిన్ రవీంద్ర(0), స్కాట్ కుగ్గెలిజిన్(0) డకౌట్‌గా వెనుదిరిగారు. ఆసీస్ బౌలర్లలో నాథన్ లయన్‌తో పాటు జోష్ హజెల్ వుడ్ రెండు వికెట్లు తీయగా.. మిచెల్ స్టార్క్, ప్యాట్ కమిన్స్, మిచెల్ మార్ష్ తలో వికెట్ తీసారు. అంతకుముందు 279/9 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 115.1 ఓవర్లలో 383 పరుగులకు ఆలౌటైంది. కామెరూన్ గ్రీన్(275 బంతుల్లో 23 ఫోర్లు, 5 సిక్సర్లతో 174 నాటౌట్) భారీ శతకంతో చెలరేగాడు. జోష్ హజెల్ వుడ్‌తో కలిసి చివరి వికెట్‌కు 106 పరుగులు జోడించాడు. కివీస్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ(5/70) ఐదు వికెట్లతో సత్తా చాటాడు. 204 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లకు 13 పరుగులే చేసింది. స్మిత్(0), మార్నస్ లబుషఏన్(2) దారుణంగా విఫలమవ్వగా.. ఉస్మాన్ ఖవాజా(5 బ్యాటింగ్), నాథన్ లయన్(6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

# రజత్ పటిదార్ పై నమ్మకం ఉంటే అవకాశాలు ఇవ్వాలి

## సౌతాఫ్రికా దిగ్గజ క్రికెటర్ ఏబీ డివిలియర్స్



ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో కుర్రాళ్లకు టీమిండియా యాజమాన్యం అవకాశాలు ఇచ్చింది. మిడిలార్డర్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్, వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్, బౌలర్ ఆకాశ్ దీప్ వాటిని సద్వినియోగం చేసుకున్నారు. కానీ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రజత్ పటిదార్ నిరాశపరిచాడు. వైజాగ్ టెస్టుతో అరంగేట్రం చేసిన అతడు గత ఆరు ఇన్నింగ్స్‌ల్లో ఆకట్టుకునే ప్రదర్శన చేయలేకపోయాడు. రజత్ పటిదార్ స్పిన్నర్ల చేతిలోనే ఔటయ్యాడు. వైజాగ్ టెస్టు (33, 9 పరుగులు) రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ రెహాన్ అహ్మద్ బౌలింగ్ వెనుదిరిగాడు. అలాగే రాజ్‌కోట్ టెస్టులో (5, 0) టామ్ హర్ట్‌లీ బౌలింగ్‌లో, రాంచీ టెస్టులో (17, 0) షోయబ్ బషీర్ బౌలింగ్‌లో పెవిలియన్‌కు చేరాడు. దీంతో రజత్ పటిదార్ స్థానంలో దేవదత్ పడిక్కల్ అవకాశాలు ఇవ్వాలనే వాదనలు గట్టిగా వినిపిస్తున్నాయి. ధర్మశాల టెస్టులో పడిక్కల్ అరంగేట్రం ఖాయమని వార్తలు కూడా వస్తున్నాయి.ఈ నేపథ్యంలో రజత్ పటిదార్‌కు సౌతాఫ్రికా దిగ్గజ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ మద్దతుగా నిలిచాడు. గుర్తుండిపోయే ఇన్నింగ్స్‌లు ఆడనప్పటికీ రజత్‌కు మరికొన్ని అవకాశాలు ఇవ్వాలని పేర్కొన్నాడు. ఇంగ్లండ్ సిరీస్‌లో సత్తాచాటుతున్న టీమిండియా రజత్‌ను కొనసాగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. "ఈ సిరీస్‌లో జీవితాంతం గుర్తుండిపోయే ప్రదర్శన రజత్ పటిదార్ చేయలేదు. కానీ భారత క్రికెట్‌లో ఓ మంచి సంస్కృతి ఉంది. జట్టు గొప్పగా ఆడుతూ, విజయాల బాటలో ఉంటే ఆటగాళ్లకు అవకాశాలు కొనసాగిస్తారు. రజత్ పటిదార్‌కు సామర్థ్యం ఉండి, డ్రెస్సింగ్ రూమ్‌లో అతడిపై మంచి అభిప్రాయం ఉంటే.. రోహిత్, తుది జట్టును ఎంపిక చేసే ప్యానెల్ అతడిని జట్టులో ఉంచుతారు. ప్రస్తుతం రజత్ పటిదార్ పరుగులు సాధించనప్పటికీ అతడిపై నమ్మకం ఉంటే అతడికి అవకాశాలు ఇవ్వాలి" అని డివిలియర్స్ పేర్కొన్నాడు. మార్చి 7 నుంచి ధర్మశాల వేదికగా భారత్-ఇంగ్లండ్ మధ్య ఆఖరి టెస్టు జరగనుంది. అయిదు టెస్టుల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే టీమిండియా 3-1 తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఓటమి అనంతరం రోహిత్ సేన పుంజుకుని వరుసగా హ్యాట్రిక్ విజయాలు నమోదుచేసింది.

# కేన్ విలియమ్సన్ డకౌట్





ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మధ్య రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభమైంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ వెల్లింగ్టన్ వేదికగా జరుగుతోంది. బేసిన్ రిజర్వ్ మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ దిగ్గజ బ్యాట్స్‌మెన్ కేన్ విలియమ్సన్ జీరోకే ఔటయ్యాడు. ఖాతా కూడా తెరవలేకపోయాడు. అతని ఇన్నింగ్స్ కేవలం రెండు బంతుల్లోనే ముగిసింది. విలియమ్సన్ అవుట్ కావడం న్యూజిలాండ్‌కు పెద్ద దెబ్బగా మారింది. ఎందుకంటే కివీస్ జట్టు ప్రధాన బ్యాట్స్‌మన్స్ బ్యాటింగ్‌పైనే ఆధారపడింది. విలియమ్సన్ ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఆడలేదు. అదే సమయంలో అతనికి 12 సంవత్సరాలుగా జరగనిది ఇక్కడ ఎదురైంది. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 383 పరుగులు చేసింది. అందుకు కామెరాన్ గ్రీన్ 174 పరుగుల అజేయ ఇన్నింగ్స్ ఆడాడు. కానీ, ఈ స్కోరు ముందు న్యూజిలాండ్ జట్టు తడబడింది. ఆ జట్టులోని టాప్-4 బ్యాట్స్‌మెన్స్ రెండంకెల స్కోరును కూడా అందుకోలేకపోయారు. న్యూజిలాండ్ మొత్తం స్కోరు 12 పరుగుల వద్ద టామ్ లాథమ్ వికెట్ కోల్పోయినప్పుడు, విలియమ్సన్ మైదానంలోకి వచ్చాడు. ఆయన వచ్చిన తర్వాత టీమ్‌ని టేకోవర్ చేస్తారనిపించింది. కానీ, ఇది జరగలేదు. విలియమ్సన్ తన సొంత ఆటగాడి చేతిలో రనౌట్ కావడంతో పెవిలియన్‌కు చేరుకోవాల్సి వచ్చింది. ఆరో ఓవర్ వేయడానికి వచ్చిన మిచెల్ స్టార్క్ బంతిని ఫుల్ లెంగ్త్‌లో వేశాడు. విలియమ్సన్ దానిని మిడ్ ఆఫ్‌లోకి తరలించాడు. విలియమ్సన్ ఒక పరుగు తీసుకోవడానికి ప్రయత్నించాడు. అయితే అవతలి ఎండ్‌లో నిలబడిన విల్ యంగ్, విలియమ్సన్ పిలుపును వినకుండా బంతిని చూడటం ప్రారంభించాడు. విలియమ్సన్ అతడిని ఢీకొట్టాడు. ఇంతలో, లాబుస్చాగ్నే బంతిని అందుకొని స్టంప్‌పై నేరుగా త్రో కొట్టాడు. విలియమ్సన్ తన ఖాతా తెరవడానికి ప్రయత్నించాడు. కానీ రనౌట్ కావడంతో.. 2012 తర్వాత విలియమ్సన్ టెస్టులో తొలిసారి ఇలా ఔటవ్వాల్సి వచ్చింది.విలియమ్సన్ ఔటైన తర్వాత ఆ షాక్ నుంచి తేరుకోలేకపోయిన కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 179 పరుగులకే ఆలౌటైంది. గ్లెన్ ఫిలిప్స్ అత్యధికంగా 79 పరుగులు చేశాడు. చివర్లో మ్యాట్ హెన్రీ 42 పరుగులతో ఇన్నింగ్స్ ఆడాడు. అంతకుముందు, న్యూజిలాండ్ దక్షిణాఫ్రికాతో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడింది. ఈ సిరీస్‌లో విలియమ్సన్ బ్యాట్ మెరిసింది. ఈ రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో విలియమ్సన్ రెండు మ్యాచ్‌ల్లోనూ సెంచరీలు సాధించాడు. తొలి మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు సాధించాడు. ఆ తర్వాత రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీ సాధించాడు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న టెస్టు మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో విలియమ్సన్ తన బ్యాట్‌తో పరుగులు చేసేందుకు ప్రయత్నిస్తాడు.



# 49 బంతుల్లోనే ఊచకోత..

నేపాల్ వేదికగా జరుగుతున్న ట్రై నేషన్ టీ20 సిరీస్‌లో నెదర్లాండ్స్, నమీబియా మధ్య మ్యాచ్ జరుగుతోంది. తొలుత బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 247 పరుగులు చేసింది. నెదర్లాండ్స్ తరపున 20 ఏళ్ల బ్యాట్స్‌మెన్ మైకేల్ లెవిట్ సెంచరీ చేశాడు. కేవలం 49 బంతుల్లోనే లెవిట్ తొలి టీ20 సెంచరీ పూర్తి చేశాడు. అంతర్జాతీయ టీ20లో సెంచరీ చేసిన నెదర్లాండ్స్‌కు చెందిన రెండో బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. అతనికి ముందు, మాక్స్ ఓ'డౌడ్ కూడా 2021లో మలేషియాపై సెంచరీ సాధించాడు. ఇప్పటి వరకు ఇదే రికార్డుగా నిలిచింది. తాజాగా ఈ ప్లేయర్ దెబ్బకు రికార్డులు మారిపోయాయి. మైఖేల్ లెవిట్ 62 బంతుల్లో 135 పరుగులు చేసి ఔటయ్యాడు. అతను 217 స్ట్రైక్ రేట్ వద్ద పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో నెదర్లాండ్స్‌కు చెందిన ఈ యువ బ్యాట్స్‌మెన్ 11 ఫోర్లు, 10 సిక్సర్లు బాదాడు. అంటే లెవిట్ 21 బంతుల్లో ఏకంగా ఫోర్లు, సిక్సర్లతో 104 పరుగులు చేశాడు. లెవిట్‌తో పాటు, సైబ్రాండ్ ఎంగెల్‌బ్రెచ్ట్ కూడా నెదర్లాండ్స్ తరఫున హాఫ్ సెంచరీ చేశాడు. 40 బంతుల్లో 75 పరుగులు చేసి ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇన్నింగ్స్‌లో ఇంగ్లెబ్రెట్ 5 సిక్సర్లు, 7 ఫోర్లు కొట్టాడు. చివరి ఓవర్‌లో తేజ నిడమూరు 3 బంతుల్లో 600 స్ట్రైక్ రేట్‌తో 18 పరుగులు చేశాడు. ఎంగిల్‌బ్రెచ్ట్, లెవిట్ మధ్య రెండో వికెట్‌కు 193 పరుగుల భాగస్వామ్యం ఉంది. 15 పరుగుల స్కోరుపై నెదర్లాండ్స్‌కు తొలి దెబ్బ తగిలింది. కానీ, ఆ తర్వాత లెవిట్, ఇంగ్లెబ్రెట్ లు తుఫాను బ్యాటింగ్ చేసి 18వ ఓవర్లో జట్టు స్కోరును 200 దాటించారు. దీని తర్వాత లెవిట్ తన సెంచరీ పూర్తి చేసి 135 పరుగుల ఇన్నింగ్స్ ఆడి అవుట్ అయ్యాడు. నెదర్లాండ్స్ బ్యాట్స్‌మెన్ సాధించిన అత్యధిక స్కోరు ఇదే కావడం గమనార్హం. కాగా, నెదర్లాండ్స్ 247 పరుగులు చేసింది. టీ20లో జట్టుకు ఇదే అతిపెద్ద స్కోరుగా నిలిచింది.అంతకుముందు, నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో నమీబియా బ్యాట్స్‌మెన్ జాన్ నికోల్ లాఫ్టీ ఈటన్ 36 బంతుల్లో 101 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. టీ20 చరిత్రలో ఇదే ఫాస్టెస్ట్ సెంచరీగా నిలిచింది. ఈ ఇన్నింగ్స్‌లో లాఫ్టీ ఈటన్ 8 సిక్సర్లు, 11 ఫోర్లు కొట్టాడు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com